ఈనాడు కర్ణాటక
మంగళవారం సెప్టెంబరు 1, 2026

బసవేశ్వర వైభవం చారిత్రక కలబురగిలోని శరణు బసవేశ్వర ఆలయ మహా రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు కదలివచ్చి శ్రీ బసవ వైభవాన్ని కీర్తిస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయం ముంగిట కానవచ్చిన జన సందోహమిదీ **(న్యూస్‌టుడే, కలబురగి)**

రావయ్యా.. మా ఇంటికి

చక్కని మట్టి గణపతులకు కుందానగరి బెళగావి కళాకారులు రూపునిస్తున్నారు. రానున్న వినాయక చవితిని దృష్టిలో ఉంచుకుని ఈసారి చిన్నవైనా.. చూడచక్కని బొజ్జగణపయ్యలను సిద్ధం చేసి.. బెళగావి నడిబొడ్డున విక్రయానికి ఉంచారు. నగర వ్యాప్తంగా వందకు పైగా ఇలాంటి శిబిరాల్లో గణపతులు ఆకట్టుకుంటున్నారు **(న్యూస్‌టుడే, బెళగావి)**

పేదల గూళ్లు బుగ్గి

బాగల్‌కోటె, న్యూస్‌టుడే : శ్రావణమాస పురాణ ప్రవచనాలు వినడానికి వెళ్లిన ఆ పేదల గూళ్లు నిలువునా కాలిపోయాయి. బాగల్‌కోటె సమీపాన పేదలు నిర్మించుకున్న 200 గుడిసె (షెడ్ల)ల్లో 30 గడపలు దగ్ధమయ్యాయి. ఆదివారం రాత్రి సమీపంలోని బసవేశ్వర ఆలయంలో శ్రావణ ప్రవచనం ఆలకించడానికి ఎక్కువ మంది వెళ్లిన సమయంలో మంటలు చెలరేగాయి. అక్కడి వారు మంటలు ఆర్పడానికి ఎంత శ్రమించినా వీలు కాలేదు. అగ్నిమాపక దళాలు స్పందించే సరికి.. 30 కుటుంబాలు నీడలేనివిగా వీధిన పడ్డాయి. చాన్నాళ్ల కిందట ఎగువ కృష్ణ పథకాల్లో భాగంగా పేదల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అలా భూములు ఇచ్చిన వారిలో అత్యధికులు ఈ గుడిసెల్లో ఉంటూ.. శాశ్వత నివాస సముదాయాల నిర్మాణం కోసం ఎదురు చూస్తుండటం గమనార్హం.

గ్రాసం ఎగుమతి నిలిపివేత

బెంగళూరు, న్యూస్‌టుడే : కరవు పరిస్థితుల నేపథ్యంలో స్థానికంగా పశువులకు గ్రాసం కొరత ఎదురుకాకుండా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు, చుట్టుపక్కల పాడిపరిశ్రమ బాగా విస్తరించిన క్రమంలో ఇక్కడి నుంచి గడ్డి ఎగుమతిపై తాత్కాలిక నిర్బంధం విధించారు. స్థానిక అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తంబి.. నీరు లేదప్పా

కావేరి కష్టాలపై కన్నడనాడు వాదన

గలగలపారే కావేరిలో ఈసారి తరిగిపోయిన పరుగులు

ఈనాడు, బెంగళూరు : ఓ వైపు కన్నడనాడు కరవు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతుండగా.. తమకు రావాల్సిన నీటి వాటాపై తమిళనాడు పట్టు బిగిస్తోంది. ప్రతి రెండు వారాలకు ఓసారి కావేరి జల నిర్వహణ సమితి (సీడబ్ల్యూఎంఏ) ఈ రెండు రాష్ట్రాల పంచాయితీని తీర్చేందుకు ప్రయత్నించినా పరిష్కారం అంతంత మాత్రమే. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు 'ఇండి'యా కూటమిలో భాగమైనా రాజకీయ పొత్తుల కంటే రైతుల సంక్షేమమే కీలకమని ఇరు రాష్ట్రాల జలవనరుల అధికారులు, రైతులు తమ గోడును సీడబ్ల్యూఎంఏ ముందు వెళ్లబోస్తున్నారు. వీటికి తోడు ఇటీవలే తమిళనాడు ప్రధాన విపక్షం డీఎంకే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బిలిగుండ్లు జలాశయం నుంచి తమిళనాడుకు నీరు విడుదల చేసేలా ఆదేశించాలంటూ అదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసుకుంది. ఈ పిటిషన్‌పై సోమవారం విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల వాదనలు మాత్రమే ఆలకించిన ధర్మాసనం మలి విచారణ ఈనెల 15న చేపడతామని ప్రకటించింది.

ఎక్కువ నీరిచ్చాం..

తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ విద్యానాథన్, కర్ణాటక పక్షాన శ్యామ్‌దివాన్ తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు. ఆగస్టు 25న సీడబ్ల్యూఎంఏ ఆదేశాల ప్రకారం నిత్యం తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని 15 రోజుల పాటు విడుదల చేయాల్సి ఉన్నా.. ఆగస్టు 30న 9,888 క్యూసెక్కులు, 31న ఉదయం 8 గంటల సమయానికి 11,547 క్యూసెక్కుల నీటిని అందించినట్లు కర్ణాటక వివరణ ఇచ్చింది. ఈ ప్రకారం సీడబ్ల్యూఎంఏ ఆదేశాల కంటే ఎక్కువ నీటినే తమిళనాడుకు విడుదల చేసినట్లు వెల్లడించింది. కన్నడనాడు వాదనలపై ఆక్షేపణ వ్యక్తం చేసిన తమిళనాడు న్యాయవాది ఆగస్టు 12న సీడబ్ల్యూఎంఏ ఆదేశం ప్రకారం 12 వేల క్యూసెక్కులు నిత్యం విడుదల చేయాల్సి ఉన్నా మా పరిస్థితిని పరిగణించని సంస్థ తొమ్మిది వేల క్యూసెక్కులకు ఎందుకు తగ్గించిందో అంతుపట్టలేదని అభ్యంతరం తెలిపింది. మొత్తం బిలుగుండ్లు నుంచి ఆగస్టు 27 నాటికి 104 టీఎంసీల నీరు తమిళనాడుకు అందాల్సి ఉన్నా ఈ సమయానికి 49 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేసినట్లు తప్పుబట్టింది. ఈ జలాశయం ఆయకట్టులో 24,700 ఎకరాల పంట ఆధారపడి ఉన్నా ఆగస్టు నాటికి 50 శాతం పంటలకు కూడా నీరు అందలేదన్నది తమిళ వాదన. డీఎంకే పిటిషన్ ప్రకారం ఆగస్టు 27 నాటికి విడుదల చేయాల్సిన 17.604 టీఎంసీల నీటిపై ఆదేశాలివ్వాలని ధర్మాసనానికి మనవి చేయడం గమనార్హం.

మా వాదన పట్టదా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 150 కరవు తాలూకాల్లో 15 తాలూకాలు కావేరి నదీ పరీవాహకంలో ఉన్నాయి. సెప్టెంబరు, అక్టోబరులో వర్షం పడని పక్షంలో పంటకే కాదు తాగేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఎదురవుతుందని కర్ణాటక చెరకు రైతుల సంఘం నాయకుడు కురుబూరు శాంతకుమార్ అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రం మాత్రమే కరవు ప్రాంతాలను సమీక్షించింది. కేంద్రం నుంచి ప్రత్యేక బృందాలు రాలేదు. వీరి ముందు ఈ ప్రాంత రైతుల సమస్యలు వెల్లడించి తద్వారా కావేరి జలాలను పరిరక్షించుకుంటామని ప్రకటించారు.

కరవులో కష్టమే

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 150కిపైగా తాలూకాలను కరవు ప్రాంతాలుగా గుర్తించింది. కావేరి నదీ పరీవాహక ప్రాంతంలోని జలాశయాల్లో 60 శాతం నీరు మాత్రమే సేకరించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న అంచనా కూడా వాతావరణ శాఖ వేయలేకపోతోందని కర్ణాటక వాదించింది. ఇంతటి పరిస్థితుల్లోనూ సీడబ్ల్యూఎంఏ ఆదేశానికి మించి నీరు తమిళనాడుకు అందించినట్లు శ్యామ్‌దివాన్ వాదించారు. సెప్టెంబరు 8వరకు 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నా అప్పటి వరకు నమోదయ్యే వర్షపాతాలు, జలాశయాల్లోని మిగులు నీటిని ఆధారంగా చేసుకునే తమిళనాడుకు నీరు అందివ్వగలమని చెప్పారు. ఇరు రాష్ట్రాల వాదనలు విన్న ధర్మాసనం ఏ అధికారిక సూచన చేయకుండా విచారణను ఈనెల 15కు వాయిదా వేసి అంత వరకు ఇరు రాష్ట్రాల సరిహద్దులో వర్షాలు, జలాశయాల నీటిని సమీక్షించాలని సీడబ్ల్యూఎంఏకు ఆదేశించింది.

శరణతత్వమే అత్యుత్తమం

మాటమార్చిన రాయరెడ్డి

బసవరాజ రాయరెడ్డి

కొప్పళ, న్యూస్‌టుడే : ప్రపంచంలో ముస్లిం ధర్మమే గొప్పదని ఆదివారం వ్యాఖ్యలు చేసిన ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ రాయరెడ్డి సోమవారానికి ప్లేటు ఫిరాయించారు. బసవేశ్వరుడు చెప్పిన 'కళబేడ, కొలబేడ, హుసియ నుడియలు బేడ' అనే వచనాన్ని ఉటంకిస్తూ శరణతత్వమే ప్రపంచంలో అత్యుత్తమమైందని విశ్లేషించారు. ఆయన సోమవారం యలబుర్గలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని ధర్మాలూ గొప్పవేనని చెప్పానని, దానిలో తప్పేముందని ప్రశ్నించారు. ఇస్లాంలోనూ అత్యుత్తమ విషయాలు ఉన్నాయని చెప్పానని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నవ ముస్లిం వధూవరులకు ఆశీస్సులు అందిస్తూ తాను మాట్లాడానని తెలిపారు. తాను అన్ని ధర్మాలనూ సమానంగా చూస్తానని, ఆయా ధర్మాల చరిత్రను తెలుసుకునేందుకు ఇష్టపడతానని చెప్పారు. క్రీస్తు సమాధిని ఇప్పటికే చూసి వచ్చానని గుర్తు చేశారు. సింధూ నదితోనే దేశానికి హిందూ అనే పదం వచ్చిందన్నారు. ప్రపంచంలో పలు ధర్మాలను నెలకొల్పిన వారు ఉన్నారని, హిందూ ధర్మానికి మాత్రం ప్రత్యేకంగా ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. యలబుర్గలోని ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి ఆయన సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

బళ్లారి.. కేసరి రణభేరి

గనినాడు సలసలా : బళ్లారి కేంద్రంగా కొత్త రాజకీయానికి తెరలేపిన భాజపా. నేడు అందరి దృష్టీ ఈ బిసిలినాడు పైనే..

ఈనాడు, బెంగళూరు : కాంగ్రెస్ సర్కారుపై కమలశ్రేణుల ఆందోళన పర్వం మరో ఘట్టానికి చేరుకుంది. మొన్నటి వరకు విధానసభ సమావేశాల్లో అలుపెరుగని పోరు సాగించిన ప్రధాన విపక్షం.. మంగళవారం నుంచి మరో రూపంలో ఆందోళన ప్రారంభించింది. గనులనాడును పోరు గడ్డగా మార్చుకున్న కమలనాథులు పది రోజుల పాటు దాదాపు 185 కి.మీ.ల పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. పాదయాత్రకు ముందే మంత్రి నాగేంద్రతో రాజీనామా చేయించగలిగిన భాజపా పట్టు వీడక పోరుబాటను కొనసాగిస్తోంది. జాతీయ స్థాయిలో ఎన్‌డీఏలో ఉన్న మైత్రి ధర్మాన్ని రాష్ట్రంలో పాటించేందుకు ఏమాత్రం ఇష్టపడని దళపతులు ఈ యాత్రకు అంతంత మాత్రంగానే సహకరించాలని నిర్ణయించుకోవడం కొసమెరుపు

యాత్ర సాగతుందిలా!

'బళ్లారి చలో' పేరిట చేపట్టే పది రోజుల పాదయాత్ర రాయచూరు జిల్లాలోని లింగసూగూరులో మొదలై మస్కి, సింధనూరు, కారటగి, గంగావతి, కంప్లి, సండూరు, బళ్లారి గ్రామీణ మీదుగా బళ్లారి నగరానికి చేరుకుని ముగుస్తుంది. మంగళవారం ఉదయం 11 గంటలకు లింగసుగూరులో ప్రారంభమయ్యే యాత్రలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంపీలు జగదీశ్ శెట్టర్, బసవరాజ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప వంటి సీనియర్లతో పాటు విపక్ష నేత ఆర్.అశోక్, పార్టీ రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, పరిషత్తులో విపక్ష నేత చలవాది నారాయణస్వామి, పార్టీ రాష్ట్ర సహబాధ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, గోవింద కారజోళ, బళ్లారి నేతలు గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములుతో పాటు స్థానిక నేతలు అడుగులు వేస్తారు. ఇప్పటికే వాల్మీకి సంక్షేమ మండలి నిధుల మళ్లింపు ఆరోపణలతో మంత్రి నాగేంద్ర రాజీనామా చేయగా, ఇదే ఆరోపణల్లో దారి మళ్లిన నిధులన్నీ తిరిగి రప్పించటం, మృతుడు చంద్రశేఖర్ కుటుంబానికి న్యాయం, గిరిజన సముదాయ అభివృద్ధి పనుల పునరుద్ధరణ వంటి కీలక డిమాండ్లతో పాటు ప్రజలు, రైతులు, మహిళలు, యువకుల వ్యతిరేక కాంగ్రెస్ సర్కారు వైఫల్యాన్ని ఎండగడుతూ ఈ యాత్ర సాగుతుందని భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రజలంతా ఈ యాత్రలో భాగస్వాములై సర్కారు తొలగించేందుకు సహకరించాలని భాజపా పిలుపునిచ్చింది.

ముఖ్యమంత్రి ధీమా

పాదయాత్ర ద్వారా సర్కారుకు ప్రత్యేకంగా జరిగే నష్టమేమీ లేదని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తేల్చిచెప్పారు. 'మేమూ రాజకీయం చేయగలం. వారికి దీటుగా యాత్ర ఎలా చేయాలో మాకూ తెలుసు. ఇప్పటికే నాగేంద్ర రాజీనామా చేశారు. మా మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇదేదో మా సాధన అంటూ ప్రచారం చేసుకుంటున్న భాజపా తమ పాలన కాలాల్లో చేసిన అక్రమాలు వెలికి తీస్తే ఆ నేతలంతా జైళ్లకు క్యూ కడతారు' అని డీకే అన్నారు.

దళపతులెక్కడ?

ఈ యాత్రలో కేంద్ర మంత్రి, జేడీఎస్ అగ్ర నేత హెచ్‌డీ కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్ పాల్గొంటారని భాజపా ప్రకటించినా వారి భాగస్వామ్యం దాదాపు ఉండబోదని తెలుస్తోంది. నేటి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామని వారం ముందే భాజపా ప్రకటించినా కుమారస్వామి సోమవారమే దిల్లీకి వెళ్లి అక్కడ కేపీఎస్‌సీ అక్రమాలపై దాఖలాలు విడుదల చేశారు. ఈ సుదీర్ఘ విలేకరుల సమావేశంలో వాల్మీకి మండలి అక్రమాలు, భాజపా పాదయాత్ర గురించి ఎలాంటి ప్రస్తావన తేలేదు. కొందరు స్థానిక జేడీఎస్ నేతలు ఈ యాత్రలో పాల్గొంటారని భాజపా చెబుతున్నా.. యాత్ర తేదీలను ఖరారు చేసే ముందు మాతో మాట మాత్రమైనా చెప్పలేదని దళపతులు మండిపడుతున్నట్లు తెలుస్తోంది.

మేరీమాత.. అభయ ప్రదాత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శివాజీనగర సెయింట్ బెసిలికా చర్చిలో మేరీ మాత ఉత్సవాలు సోమవారం పెద్దఎత్తున నిర్వహించారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి చర్చిలో ప్రారంభించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొందరు కాషాయ దుస్తులు ధరించి ఇళ్ల నుంచి ఉపవాస ప్రార్థనతో నడిచి చర్చికు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేశంలో మరెక్కడా లేనంత చక్కగా పట్టుచీర ధరించిన మేరీమాత దర్శనంతో భక్తులు పరమానందానికి లోనయ్యారు. గౌను ధరించిన రీతిలో అలంకరించిన బాల ఏసు విగ్రహం ఇట్టే ఆకట్టుకుంది. తల్లి ఒడిలో ఒదిగిన ఏసు క్రీస్తు విగ్రహం వద్ద భక్తులు తమ కోర్కెల చీటీలను కట్టి ప్రార్థించారు. ఉదయం నుంచి రాత్రి వరకు చర్చిలో వివిధ భాషల్లో మతగురువులు ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా అమ్మ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ హర్షద్ తదితరులూ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఉత్సవాలకు హాజరైన పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ హర్షద్ తదితరులు

భగ్గుమన్న విపక్షం

ఆర్.అశోక్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ముస్లిం ధర్మమే శ్రేష్ఠమైనదని వ్యాఖ్యలు చేసిన బసవరాజ రాయరెడ్డి బేషరతుగా హిందువులకు క్షమాపణలు చెప్పాలని విధాన సభ విపక్ష నేత ఆర్. అశోక్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మొదటి నుంచి హిందువుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని రాయరెడ్డి వ్యాఖ్యలతో తేటతెల్లమైందన్నారు. హిందువులకు ఆయన క్షమాపణలు చెప్పకపోతే తక్షణమే మంత్రిపదవి నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి వ్యాఖ్యలను అవలోకిస్తే అది ఆయన వ్యక్తిగతమో, పార్టీ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, వారినే తక్కువ చేసి మాట్లాడారని దుయ్యబట్టారు.

- మంత్రివర్గంలో అత్యంత మేధావి బసవరాజ రాయరెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన నోటి నుంచి ఇటువంటి వ్యాఖ్యలు వస్తాయని ఎవరూ ఊహించలేదని అన్నారు. రాయరెడ్డి తీరును ఖండిస్తూ అశోక్, బొమ్మై ఇద్దరూ తమ ఎక్స్ ఖాతాలో ట్వీట్లు చేసి, విమర్శలు గుప్పించారు.

సీఐడీ సోదాలతో హడల్

జ్ఞానేంద్రకుమార్

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్‌సీ) ఆధ్వర్యంలో పశువైద్యాధికారుల నియామక ప్రక్రియలో చోటు చేసుకున్న అక్రమాల కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్‌తో పాటు బీదర్‌కు చెందిన బసవరాజ్ కన్నాళ్ అనే అధికారిని సీఐడీ అధికారుల విచారణ తీవ్రమైంది. శనివారం అర్ధరాత్రి జ్ఞానేంద్ర గంగ్వార్‌ను అరెస్టు చేసినట్లు ప్రకటించిన సీఐడీ, ఆయనను పరప్పన అగ్రహార కారాగారానికి పంపించింది. సోమవారం మళ్లీ న్యాయస్థానం ముందు హాజరు పరచి, విచారణ నిమిత్తం తమకు అప్పగించాలని కోరగా, న్యాయమూర్తి అంగీకరించారు. తుమకూరు విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడు, భాజపా నాయకుడు బసవరాజ కన్నాళెను సీఐడీ అధికారులు దిల్లీలో ఆదివారం అరెస్టు చేసి, బెంగళూరుకు తీసుకువచ్చి, కోర్టులో హాజరు పరిచారు. బసవరాజకు పర్యాటక, రవాణా రంగాల్లో వ్యాపారాలు ఉన్నాయి. జ్ఞానేంద్ర కుమార్‌కు ఆయన అత్యంత ఆప్తుడు. వీరిద్దరినీ సెప్టెంబరు 9 వరకు విచారించేందుకు న్యాయమూర్తి అవకాశం కల్పించారు. భాల్కిలోని బసవరాజ్‌కు చెందిన రెండు నివాసాల్లోనూ సీఐడీ అధికారులు సోదాలు ప్రారంభించారు. వీరిద్దరి అరెస్టుతో ఈ కుంభకోణంలో సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కమిషన్ మాజీ అధ్యక్షుడు శివశంకరప్ప సాహుకార్, ఇతర సభ్యుల్లో గుబులు మొదలైంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు శాంత హొసమని అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో ఆమెపై ఈడీ అధికారులు లుకవుట్ నోటీసులు జారీ చేశారు.

సాహుకారుకు చేదు అనుభవం

బెంగళూరు, న్యూస్‌టుడే : కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్‌సీ) ఆధ్వర్యంలో గతంలో పూర్తి చేసిన పశువైద్యాధికారుల నియామక ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి సస్పెన్షన్‌కు గురైన శివశంకరప్ప సాహుకార్ కోర్టు మెట్లెక్కారు. ఈ నేరంలో తనపాత్ర ఏమీలేదని, విచారణ చట్రం నుంచి రక్షణ కల్పించాలని పిటిషన్ దాఖలు చేయడంతో.. సంబంధిత న్యాయాలయం సున్నితంగా తోసిపుచ్చింది. విచారణ నుంచి ఇప్పటికిప్పుడు (మధ్యంతరంగా) తప్పించడం వీలుకాదన్న రీతిలో మౌఖికంగా స్పందించింది. విచారణ మరిన్ని వివరాలు అందాల్సి ఉంది.

రైతుల సంక్షేమానికి కంకణం

ముఖ్యమంత్రి డీకే ప్రకటన

ఇళ్ల స్థలాల పత్రం అందిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రి, ఎన్.ఎ.హ్యారీస్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : "నేను రైతు బిడ్డను. భూమి కోల్పోతే రైతు పడే బాధేంటో బాగా తెలుసు. అభివృద్ధి పథకాల కోసం భూములిచ్చిన రైతుల రుణం తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. నెహ్రూ తారాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన 'డాక్టర్ శివరామకారంత లేఅవుట్' కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, ఇళ్ల స్థలాలను ముఖ్యమంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. బెంగళూరు నగరాభివృద్ధి సంస్థ (బీడీఏ) ఆధ్వర్యంలో ఈ లేఅవుట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భూములిచ్చిన రైతులను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదన్నారు వారి హక్కులు సంరక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే ఇళ్ల స్థలాల హక్కుల ధ్రువీకరణ పత్రం పంపిణీ చేసే కార్యక్రమం కాదని, చాలా ఏళ్లుగా రైతులు, వినియోగదారులు ఎదురు చూస్తున్న కార్యక్రమమన్నారు. భూములిచ్చిన రైతులను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ శివరామ కారంత లేఅవుట్ పథకం అనేక వివాదాల్లో కూరుకుపోయిందని, ఇప్పుడా సమస్యలు తీరినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన రైతుల హక్కులను సంరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇక్కడి రహదారికి దివంగత మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణహెగ్డే పేరు పెడతామన్నారు. కొన్ని రహదారులకు ఎక్కువ భూమి ఇచ్చిన రైతుల పేర్లు నామకరణం చేస్తామన్నారు. భూములిచ్చిన రైతుల పేర్లను శిలాఫలంపై చెక్కిస్తామన్నారు. అభివృద్ధి చేసిన 24,714 ఇళ్ల స్థలాల్లో 18,399 ఇళ్ల స్థలాలను రైతులు, భూములు కోల్పోయిన యజమానులకు ఇస్తామని ప్రకటించారు. మిగిలిన 3,500 ఇళ్ల స్థలాలను ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. 40:60 నిష్పత్తిలో రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. అక్కడ అన్ని వసతులూ కల్పిస్తామన్నారు. మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిడది పారిశ్రామిక లేఅవుట్ చేయాలని తీర్మానించారని, సాతనూరు ప్రాంతంలో జపాన్ ఉపనగరాన్ని నిర్మించాలని పథకాలను సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఆ రెండింటికీ తాను మద్దతు ఇచ్చినట్లు ప్రస్తావించారు. కెంగల్ హనుమంతయ్య కాలంలో బెంగళూరు నగర జనాభా 60 లక్షలు ఉండగా.. ఇప్పుడు 1.50 కోట్లు దాటిందన్నారు. జనాభాతో పాటు 1.40 కోట్ల వాహనాలు ఉండటంతో సంచార రద్దీ ఊహించలేని విధంగా పెరిగిందన్నారు. దాన్ని నియంత్రించేందుకు రూ.27 వేల కోట్లతో బెంగళూరు బిజినెస్ కారిడార్ పథకాన్ని చేపట్టినట్లు ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్రమంలో బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, బీడీఏ అధ్యక్షుడు ఎన్.ఎ.హ్యారీస్, ఎమ్మెల్యేలు ఎస్.ఆర్.విశ్వనాథ్, మునిరాజు, బీడీఏ కమిషనర్ మణివణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి కృష్ణబైరేగౌడ తదితరులు

కార్యక్రమానికి విచ్చేసిన అన్నదాతలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి డీకే

రైల్వేస్టేషన్‌లో బంగ్లాదేశీయులతో వస్తున్న పోలీసులు

చురుగ్గా ఆపరేషన్ ముక్త

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : కర్ణాటకలో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించే ప్రక్రియ 'ఆపరేషన్ ముక్త 2.0' చురుకుగా కొనసాగుతోంది. ఇటీవల ఎలక్ట్రానిక్ సిటీ, వైట్‌ఫీల్డ్ విభాగాల్లో గుర్తించిన 31 మంది బంగ్లాదేశ్‌కు చెందిన ప్రజలను సర్ ఎం.విశ్వేశ్వరయ్య రైల్వే టెర్మినల్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు సోమవారం తీసుకువెళ్లారు. వీరు మంగళవారం సాయంత్రం మాల్డా స్టేషన్‌కు చేరుకుంటారని డీసీపీ ఎం.నారాయణ్ తెలిపారు. అక్కడి నుంచి సరిహద్దు రక్షణ దళం వద్దకు తీసుకువెళ్లి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి వారికి అప్పగిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్ సిటీలో 1909 మంది విచారణ అనంతరం 43 మంది బంగ్లా జాతీయులను ఆగస్టు 9 అరెస్టు చేశారు. మరో 12 మంది విచారణ కొనసాగుతోందని, తదుపరి విడుతలో వారిని వారిని సిబ్బందికి అప్పగిస్తామని ఆయన వివరించారు.

రాహుల్‌కు కుమార సవాల్

దిల్లీ, న్యూస్‌టుడే : కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ అక్రమార్కుల కబంధహస్తాల్లో చిక్కిన అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏమని బదులిస్తారని కేంద్ర మంత్రి కుమారస్వామి నిలదీశారు. ఆయన సోమవారం దిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కేపీఎస్‌సీ అంశాన్ని ప్రస్తావించారు. నీట్ అక్రమాలంటూ దేశవ్యాప్తంగా ఆందోళన చేసిన ఆ నేత నేడు కర్ణాటకలోని అక్రమాలపై యువతకు ఏమని బదులిస్తారని నిలదీశారు. నీట్ తరహాలోనే కేపీఎస్‌సీ బాధితులనూ పరామర్శించడానికి తక్షణమే బెంగళూరులో అడుగు పెట్టాలని డిమాండు చేశారు. పాపాల పుట్టలా మారిన కర్ణాటకలో కాంగ్రెస్ నేతల అక్రమాలకు లెక్కేలేదని కుమార ఈసడించుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

పట్టువీడని కమలం.. తగ్గేదేలేదంటున్న హస్తం



పాదయాత్ర పటం

బళ్లారి, న్యూస్‌టుడే: 2026 జనవరి 1న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, నారా భరత్‌రెడ్డిల కార్యకర్తలు, మద్దతుదారుల బ్యానర్ తొలగింపు విషయంపై జరిగిన ఘర్షణతో దూరంగా ఉన్న బి.శ్రీరాములు-గాలి జనార్దన్‌రెడ్డి ఒక్కటయ్యారు. భాజపా ఐకమత్యంతో ముందుకు వెళుతునానరు. నేడు వాల్మీకి అభివృద్ధి మండలి నిధులు మళ్లింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే బి.నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలతో జిల్లాకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ, ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారు. మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఓ వైపు భాజపా నేతలు రాయచూరు జిల్లా నుంచి బళ్లారికి పాదయాత్ర ప్రారంభిస్తుండగా.. కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో ఎదురు దాడి చేయడానికి సిద్ధమయ్యారు.

పాదయాత్రవైపే మొగ్గు

2026 జనవరి 1న బ్యానర్ ఘర్షణ అనంతరం కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా మాజీ మంత్రులు బి.శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారి నుంచి బెంగళూరుకు పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. పార్టీ అధిష్ఠానం ఒప్పుకోకపోవడంతో పాదయాత్రను వాయిదా వేస్తూ వచ్చారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయింది. నేడు వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల మళ్లింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బి.నాగేంద్రకు మంత్రి పదవి ఇవ్వడంపై భాజపా అధిష్ఠానం నుంచి జిల్లా నేతల వరకు ఆందోళనతో పాటు రోడ్డెక్కారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలతో బి.నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినా.. భాజపా ఎస్టీ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయాలని నిర్ణయించింది. పాదయాత్రపై భాజపా, జేడీఎస్ నేతల మధ్య భిన్న స్వరాలు వినిపిస్తున్నా జిల్లా నేతల ఒత్తిడితో పాదయాత్రకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమం మొత్తం గాలి జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరాములుపైనే ఆధారపడింది. జిల్లాకు చెందిన భాజపా నేతలు పూర్తిగా సహకరించడం లేదని సొంత పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. పాదయాత్ర రాయచూరు జిల్లా లింగసూరు, మస్కి, సింధనూరు, కారటగి, గంగావతి, కంప్లి, సండూరు, బళ్లారి గ్రామీణ క్షేత్రాల్లో 10 రోజులపాటు కొనసాగనుంది.

ఒకేమాటపై కాంగ్రెస్ నేతలు

బ్యానర్ తొలగింపు విషయంలో, మంత్రి వర్గ విస్తరణలో ఎమ్మెల్యేలు, లోక్‌సభ, రాజ్యసభ, ద్వితీయ శ్రేణి నేతల మధ్య ఐక్యత కొరవడింది. బి.నాగేంద్ర మంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత బళ్లారికి వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యేలు, నారా భరత్‌రెడ్డి, గణేష్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ కనిపించలేదు. దీనిపై పార్టీ అధిష్ఠానం క్షుణ్ణంగా పరిశీలించింది. భాజపా నేతలు చేస్తున్న ఆరోపణలపై బి.నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయడంపై కేపీసీసీ అధ్యక్షుడు హరిప్రసాద్, ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆలోచనలో పడ్డారు. బి.నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినా భాజపా పాదయాత్ర చేయడంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది. భాజపా చేస్తున్న పాదయాత్రను తిప్పు కొట్టడానికి ఐకమత్యంతో ముందుకు వెళ్లాలి. మంగళవారం బళ్లారి నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించి భాజపా నేతలపై ఉన్న కేసులు, అక్రమాలకు సంబంధించిన పత్రాలను విడుదల చేయనున్నారు. అనంతరం పాదయాత్ర చేస్తున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు, వాల్మీకి నేతలతో సమావేశం నిర్వహించి పాదయాత్రపై గోబ్యాక్... గోబ్యాక్ అనే నినాదాలు చేసే విధంగా ఆందోళన చేయాలని నిర్ణయించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో 18 నెలల ముందు కాంగ్రెస్ - భాజపా శిబిరాల్లో రాజకీయం వేడెక్కింది.

మాజీ మంత్రి బి.శ్రీరాములు

ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

ఎమ్మెల్యే బి.నాగేంద్ర

ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుసేన్

ఊహూ..ఆమె వచ్చేదాకా..దిగేదే లేదు


గంగావతిలో సెల్‌టవర్ ఎక్కిన ప్రేమికుడు

టవర్‌పైన ఉన్న రాజా

గంగావతి,న్యూస్‌టుడే: ప్రేమించిన యువతితో పెళ్లి కోసం ప్రేమికుడు సెల్‌టవర్ ఎక్కి హంగామా సృష్టించిన సంఘటన గంగావతి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. గంగావతి తాలూకా హణవాళకు చెందిన రాజా అనే యువకుడు దేవదుర్గకు చెందిన యువతిని ప్రేమించాడు. యువతి కుటుంబ సభ్యులు ఏమన్నారో తెలీదు. యువకుడు మాత్రం టవర్ ఎక్కి కూర్చున్నాడు. గంగావతి ఏపీఎంసీ ఆవరణలో ఉన్న టవర్ ఎక్కడం చూసిన కొందరు మరమ్మతుల కోసం వచ్చిన కార్మికుడు అనుకున్నారు. టవర్ ఎక్కగానే ప్రేయసి కోసం కేకలు వేస్తూ ఆమెను తీసుకురావాలని డిమాండ్ చేశాడు. లేకపోతే పైనుంచి దూకేస్తానని బెదిరించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపకదళం సంఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నాలు చేశారు. యువకుడు మాత్రం ప్రేయసి వచ్చేదాకా టవర్ దిగనంటూ భీష్మించుకు కూర్చున్నాడు. రాత్రి ఏడు గంటలైనా యువకుడు అక్కడే కూర్చోవడంతో అతడిని ఎలా రక్షించాలనే విషయంలో పోలీసులు తర్జనభర్జనలు పడుతున్నారు.

మూడువేల మంది అధ్యాపకుల నియామకానికి చర్యలు

గంగావతి,న్యూస్‌టుడే: రాష్ట్రంలో మూడు వేల మంది అధ్యాపకుల నియామకాలను చేపడుతున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియను రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సొంత నియోజకవర్గం యలబుర్గాలో పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. 320 ప్రధాన ఆచార్యుల ఖాళీలను సైతం భర్తీ చేయనున్నామన్నారు. నియామకాలను లంచాలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 249 నకిలీ పీహెచ్‌డీ పట్టాలను గుర్తించారన్నారు. వీరిపై క్రిమినల్, వంచన కేసులు నమోదు చేస్తామన్నారు. బెంగళూరులో కృత్రిమ మేధ విశ్వవిద్యాలయం స్థాపిస్తామన్నారు. రానున్న 10 రోజుల్లో యలబుర్గా నియోజకవర్గంలోని 36 గ్రామ పంచాయతీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నగరాభివృద్ధి శాఖ మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య, లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అమరేగౌడ బయ్యాపుర పాల్గొన్నారు.

యలబుర్గాలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి

కూడ్లిగి ప్రజాసేవ అభియాన్ విజయవంతానికి పిలుపు

ముఖ్యమంత్రి కార్యక్రమంపై అధికారులకు సూచనలిస్తున్న జిల్లా పాలనాధికారి కవితా ఎస్.మన్నికేరి

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా కూడ్లిగిలో ఈ నెల 5న జరిగే ప్రజాసేవ అభియాన్ రాష్ట్రస్థాయి కార్యక్రమం విజయవంతానికి అధికారులందరూ కృషి చేయాలని జిల్లా పాలనాధికారి కవితా ఎస్.మన్నికేరి సూచించారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమం సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాసేవ శాఖ (గుమ్మం వద్దకు ప్రభుత్వం) కార్యక్రమాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రారంభించింది. 5న కూడ్లిగిలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూడ్లిగి తాలూకాకు సంబంధించిన విజ్ఞప్తులను స్వయాన ముఖ్యమంత్రి స్వీకరించి స్థలంలోనే పరిష్కరించే ప్రయత్నం చేస్తారు. ఇందుకోసం సుమారు 60 కౌంటర్లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న వ్యక్తులతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడతారన్నారు. జిల్లా, తాలూకా స్థాయి అధికారులు దగ్గరుండి ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నొంగ్జాయ్ మొహ్మదలి అక్రం షా, అదనపు పాలనాధికారి పి.ఎన్.లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరండానే పురిటి గది.. చీరలే మరుగు గోడలు

సింధనూరు, న్యూస్‌టుడే: 'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు పుడతాడు' అన్న సామెతలా..ఆ తల్లి కొడుకును కాకపోయినా సులువైన ప్రసవంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సమీపంలోని విరుపాపుర గ్రామానికి చెందిన రోజా అనే మహిళ నిండు చూలాలు. నెలలు నిండాయి. నలతగా ఉందని అనడంతో ఆమె అత్త వెంటనే ఆటోను పిలిచి సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపులోని ప్రభుత్వ తల్లీ శిశువుల ఆసుపత్రికి తీసుకొచ్చింది. ఆటో దిగి ఆసుపత్రి లోనికి మెల్లగా నడిచి వెళ్తుండగా వరండాలోనే ఆ నిండు గర్భిణి నేలపై కూర్చుండిపోయింది. వైద్యులు వచ్చేంతలోపే నొప్పితో గిలగిలలాడింది. శిశువు బయటకొచ్చేస్తోందని సంజ్ఞ చేసింది. విషయం గమనించిన సమీపంలోని కొంతమంది మహిళలు చుట్టూ నిలబడి రెండు చీరలు అడ్డుపెట్టి మానవత్వం చాటారు. అప్పటికే పండంటి ఆడ శిశువు నేల స్పర్శ తాకింది. ఇంతలో ఇద్దరు వైద్యులు అక్కడికి చేరుకుని వైద్య సాయం అందించారు. రోజాకు ఇది రెండో కాన్పు. తొలి కాన్పులోనూ శస్త్ర చికిత్స లేకుండా మగబిడ్డకు జన్మనిచ్చిన ఈమె రెండో కాన్పు సైతం ఇబ్బంది లేకుండా సుఖంగా ప్రసవించడంపై ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రసూతి వార్డులో తల్లీశిశువులను పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమం అని తెలిపారు.

ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద చీరలు అడ్డుపెట్టి నిలబడ్డ మహిళలు

వైభవంగా రథోత్సవం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధన ఉత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం ఆలయంలో నిర్మల్యం, పంచామృతాభిషేకం, స్వామి వారికి ఆభరణాలు, తులసిదండలు, పూలదండలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి పట్టణ ప్రధాన రహదారిలో ఊరేగింపుగా సంకీర్తనలు పాడుతూ, రథోత్సవాన్ని జరిపారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వృద్ధురాలికి వాత్సల్య గృహం మంజూరు

అంబమ్మకు నూతన గృహం సమకూర్చిన సంస్థ ప్రతినిధులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ వారు నిరాశ్రితురాలైన అంబమ్మకు నూతన గృహం నిర్మించి అందించారు. బగ్గూరు గ్రామంలో సోమవారం సంస్థ కొప్పళ డివిజన్ నిర్దేశకుడు చంద్రశేఖర్, బళ్లారి నిర్దేశకుడు రోహితాక్ష తదితరులు గ్రామస్థులు ఆధ్వర్యంలో సంస్థ నుంచి జ్ఞాన వికాస పథకం ద్వారా రూ.1.50 లక్షలతో నిర్మించిన వాత్సల్య గృహాన్ని అంబమ్మకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలోను నిరాశ్రితులైన వృద్ధులను గుర్తించి వారికి వాత్సల్య పథకం ద్వారా గృహాలు నిర్మించి ఇస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నాగేశప్ప, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు మారెప్ప, సంస్థ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

రఘుమూర్తి, బసవంతప్పకు ఘన సన్మానం

గజమాలతో బసవంతప్పకు సన్మానం

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: శోషిత వర్గాలకు చెందిన టి.రఘుమూర్తి, బసవంతప్పకు మంత్రి వర్గంలో చోటు లభించినందుకు మాదిగ రిజర్వేషన్ రక్షణ సమితి, డీఎస్ఎస్ కార్యకర్తలు చెళ్లకెరలో ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి ఇక్కడ ఆటల మైదానంలో ఏర్పాటు చేసిన మంత్రుల అభినందన కార్యక్రమాన్ని తప్పెట వాద్యం వాయించి ప్రారంభించిన మాజీ మంత్రి ఆంజనేయ మాట్లాడారు. శోషిత సామాజిక వర్గాల దశాబ్దాల పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల రిజర్వేషన్‌లలో వర్గీకరణ చేసి ఆదేశించిడంతో తమ సామాజిక వర్గం చదువుకొన్న యువతకు భవిష్యత్తులో అనేక ఉద్యోగ, ఉన్నత విద్యా అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సభలో మంత్రులు రఘుమూర్తి, బసవంతప్పను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మొలకాల్మూరు ఎమ్మెల్యే ఎన్.వై.గోపాలకృష్ణ, చిత్రదుర్గ ఎమ్మెల్యే కె.సి.వీరేంద్ర, అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు చెళ్లకెరకు తొలిసారి విచ్చేసిన మంత్రి బసవంతప్పను క్రేను సాయంతో గజపూలహారాన్ని వేసి స్వాగతం పలికారు.

మంత్రులు రఘుమూర్తి, బసవంతప్పకు సత్కారం

యతీంద్ర సిద్ధరామయ్యతో మేయర్ భేటీ

బళ్లారి, న్యూస్‌టుడే: జిందాల్ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో వెళ్తున్న రాష్ట్ర నగరాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్యను బళ్లారి నగర మేయర్ పూజారి గాదెప్ప, స్థాయి సమితి అధ్యక్షులు వివేక్, కుబేరా, నగర పాలికె కమిషనర్ పి.మంజునాథ కలిశారు. 2025-26 ఏడాదిలో 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నుంచి ప్రకటించిన రూ.20.74 కోట్లు విడుదల కాలేదు. ఈ విధులు విడుదల చేస్తే నగర పాలికెలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి అనుకూలంగా ఉంటుందని మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి నిధులు విడుదల చేస్తామని భరోసా ఇచ్చినట్లు మేయర్ తెలిపారు.

మంత్రి యతీంద్ర సిద్ధరామయ్యను కలిసిన మేయర్ పూజారి గాదెప్ప తదితరులు

కూడ్లిగి బంద్ ప్రశాంతం

కూడ్లిగి బంద్ సందర్భంగా ఆందోళనకారులనుద్దేశించి మాట్లాడుతున్న రైతు నాయకుడు వీరసంగయ్య

హొసపేటె, న్యూస్‌టుడే: కూడ్లిగిని కరవు తాలూకాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ రైతు, పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పిలుపునిచ్చిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన ప్రముఖులు జె.ఎం.వీరసంగయ్య, దేవరమనె మహేశ్, సూర్యపాపణ్ణ, విరుపాక్షప్ప, కాటేర హాలేశ్ తదితరులు మాట్లాడుతూ విజయనగర జిల్లాలో తీవ్రంగా వెనుకబడిన కూడ్లిగిని కరవు తాలూకాల జాబితా నుంచి విడిచిపెట్టడం దారుణమన్నారు. జాబితాను అశాస్త్రీయంగా సిద్ధం చేశారని దుయ్యబట్టారు. చివరి క్షణంలో ఓ మోస్తరు వర్షాలు కురిసాయన్న సాకుతో కూడ్లిగికి అన్యాయం చేయడం తగదని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తాలూకాను కరవు జాబితాలో చేర్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రముఖులు బాణద కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. బంద్‌కు సంఘీభావంగా వ్యాపారులు కూడా దుకాణాల్ని మూసివేశారు. డీఎస్పీ మల్లేశ్ దొడ్డమని నేతృత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

హనుమ భక్తుల భారీ ర్యాలీ

విగ్రహానికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: సనాతన ధర్మంలో పుట్టిన ఒక మంత్రి అన్ని మతాల్లో ఇస్లాం ఉత్తమమైనది అని ప్రకటన చేయడం దురదృష్టకరం. ఇలాంటి మనస్తత్వం ఉన్న వారే ఈ రోజు మంత్రులుగా ఉన్నారు. మనమందరం ఐక్యమై మన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రీమరూరు అభయాంజనేయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హనుమ భక్తులు స్థానిక సత్యనారాయణపేటె ప్రధాన రహదారి కూల్ కార్నర్ ఏర్పాటు చేసిన హనుమ భక్తుల మహా బైకు ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హనుమాన్ మాల ధరించి ఈ ఏడాదికి 11 ఏళ్లు పూర్తయ్యాయి. హనుమాన్ అంటే గొప్ప శక్తి, అపారమైన భక్తి అని అన్నారు. శ్రీరాముడి కన్నా రాముడు నామమే గొప్ప శక్తి అని హనుమంతుడు ప్రపంచానికి చూపించాడని అన్నారు. నగరంలోని కూల్ కార్నర్ సమీపంలోని ప్రముఖులు హనుమాన్ భక్తుల బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ జై హనుమాన్ జై శ్రీరామ్ నినాదాలతో నిండిపోయింది. భక్తులు భగవద్గీత, కాషాయ కండువాలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై వరుసగా సాగిన బైక్‌ల ఊరేగింపు కారణంగా నగరం మొత్తం కాషాయ శోభతో నిండిపోయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు డా.బి.కె.సుందర్, కల్యాణ స్వామీజీ, మాజీ ఎంపీ సణ్ణ పక్కీరప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, నేతలు కె.ఎస్.దివాకర్, హనుమంతప్ప, జానెకుంటె బసవరాజు, నగర పాలికె ప్రతిపక్షనేత శ్రీనివాస్ మోత్కార్, అరుణలక్ష్మి, మారుతీప్రసాద్, వెంకటరమణ, మహిపాల్, అశోక్‌కుమార్, ప్రసన్న, డా.రమేష్ గోపాల్, గోపాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి తరలివచ్చిన భక్తులు

ఆర్‌బీఎస్ఎస్ఎన్‌కు భూమి కేటాయింపు తగదు

కారిగనూరులో నిరసన తెలుపుతున్న స్థానికులు

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణ శివారు కారిగనూరులో ఉన్న రాయబహద్దూర్ సేఠ్ (ఆర్‌బీఎస్ఎస్ఎన్) గనుల కంపెనీకి ప్రభుత్వ భూమి కేటాయింపునకు వ్యతిరేకంగా సోమవారం కారిగనూరు స్థానికులు, పలు సంఘాల కార్యకర్తలు కారిగనూరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళనకు మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గనుల లీజు ముగియడంతో ఆ కంపెనీ మూతపడింది. అయినప్పటికీ తప్పు దాఖలాలు తయారు చేసి గనుల కార్యాకలాపాల కోసం 64 ఎకరాల భూమిని కంపెనీకి కేటాయించారని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.5 వేల కోట్లు, కాని తక్కువ ధరకే లీజుకు కేటాయించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీని వెనుక స్థానిక ప్రజాప్రతినిధుల హస్తముందని ఆరోపించారు. జిల్లా కేంద్రం విజయనగరలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం కొరత చాలా ఉంది, అలాంటప్పుడు 64 ఎకరాల భూమిని గనుల కంపెనీకి కేటాయించడం తగదని తేల్చిచెప్పారు. ఆదేశాన్ని మళ్లీ పరిశీలించాలని ముఖ్యమంత్రికి ఉత్తరం కూడా రాశానని తెలిపారు. కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో స్థానికులతో కలిసి తనూ ఉద్యమం చేపడతానని హెచ్చరించారు.

యువతి బలవన్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: పని కోసం సుదూరు ప్రాంతాలకు వెళ్లొద్దు, ఇంటినుంచి పని (వర్క్ ఫ్రం హోం) చేయమని కుటుంబ సభ్యులు మందలించినందుకు తీవ్ర మనస్తాపంతో తబసుమ్ (22) అనే యువతి కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తవాడ్గీలో జరిగింది. చదువు పూర్తి చేసిన ఆమెకు ఇటీవలే బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అంతదూరం వెళ్లొద్దు, ఇంట్లో నుంచి పనిచేయమని కుటుంబ సభ్యులు మందలించడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. శవపరీక్ష తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై చిత్తవాడ్గీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నృత్య కుసుమాంజలి

విద్యార్థినుల నృత్య రూపకం

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉత్తరాధనలో భాగంగా స్వామి వారి విగ్రహాన్ని రథంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది భక్తులు రథాన్ని లాగి మొక్కులను సమర్పించుకొన్నారు. జిల్లా బాధ్య మంత్రి టి.రఘుమూర్తి మఠాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా సాయంత్రం చెళ్లకెరకు చెందిన రాజ్యోత్సవ అవార్డు గ్రహీత, నృత్య గురు సుధామూర్తి ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులు నృత్య కుసుమాంజలి పేరుతో భక్తి పాటలతో నృత్య రూపాకాలను ప్రదర్శించారు. సీనియర్ విద్యార్థులైన రశ్మిత, మేఘశ్రీ, హంసవేణి, ఐరానాయక్, వందనా, రచనా, హితశ్రీ తదితరుల నేతృత్వంలో నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో నృత్యనికేతన పాఠశాల సంస్థాపకులు విష్ణుమూర్తి రావ్, రాఘవేంద్ర జోషి, శ్రీనాథ్ భట్ తదితరులు పాల్గొన్నారు.

భాజపాకు హనుమాన్ గౌడ బెళగుర్కి వీడ్కోలు

పార్టీకి రాజీనామా ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న హనుమాన్ గౌడ (ఆకుపచ్చ తువాలుతో)

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు సీనియర్ రాజకీయ నాయకుడు, కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ ధరల కమిషన్ మాజీ అధ్యక్షుడు హనుమాన్ గౌడ బెళగుర్కి భారతీయ జనతాపార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా సమర్పించినట్లు సోమవారం విలేకరులకు వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడికి మెయిల్‌లో పంపిన రాజీనామా పత్రాన్ని చూపించారు. రాజీనామాకు గల కారణాలు వెల్లడించలేదు. తదుపరి ఏ పార్టీలో చేరేది స్పష్టం చేయలేదు. సమయం వచ్చినపుడు ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని అన్నారు. భాజపా హయాంలో నన్ను కేపీసీసీ అధ్యక్షుడ్ని చేసి అప్పటి ప్రభుత్వంలో తనకు కేబినెట్ మంత్రి హోదా గల అధికారాన్ని ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను ఆయన అభినందించారు. తాను భాజపాలో చేరిన 15 రోజుల వ్యవధిలో యడియూరప్ప నన్ను ధరల కమిషన్ అధ్యక్షుడ్ని చేయడం సంతోషం కలిగించిన అంశమని అన్నారు. అధ్యక్షుడిగా తన హయాంలో పది వరకు అప్పటి ప్రభుత్వానికి నివేదికలు అందివ్వగా అందులో చాలా శాతం అమలయ్యాయని వివరించారు. జొన్న, రాగి ఉత్పత్తులకు నేడు చక్కని ధర పలుకుతుందంటే అది నాటి కమిషన్ నివేదిక ఫలితం అన్నారు. నేను ఒకే ఒక్కసారి సింధనూరు అసెంబ్లీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోడానికి పోటీ చేశాను. మరోసారి ప్రయత్నం చేసుంటే ఎమ్మెల్యేని అయ్యుండేవాడినని అనుచరులు చెబుతుంటారు..ఒక్కోసారి అది నిజమని అనిపిస్తుంటుందని హనుమాన్ గౌడ బెళగుర్కి తన మనసులోని మాటను తెలిపారు.

తేరువీధి రాఘవేంద్రుడికి పండ్లతో అలంకరణ

ముస్తాబైన సత్యనారాయణ పేట రాఘవేంద్రుడు

రాయల్‌కాలనీ సంజీవరాయ రాఘవుడు

వ్యాసరాజమఠంలో రజతకవచ, పుష్పాలంకరణ

సిరుగుప్ప రోడ్డు యంత్రోద్ధారక మఠంలో స్వామికి పండ్లతో అలంకరణ

కమనీయం.. రాఘవరాయుడి ఉత్తరారాధన

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సత్యనారాయణ పేట రాఘవేంద్రమఠంలో బృందావనానికి పంచామృతాలతో అభిషేకించారు. కనకమహాపూజ, వస్త్ర అలంకరణ సేవ, రథోత్సవం, పాదపూజ, ఫలపంచామృత తదితర పూజలు కమనీయంగా జరిపారు. రాఘవరాయుడి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. తేరువీధి రాఘవేంద్రమఠంలో స్వామివారిని పండ్లతో అలంకరించి పూజించారు. తేరువీధిలో మంగళవాయిద్యాలతో రథోత్సవం ఘనంగా జరిపారు. వ్యాసరాజమఠం రజత రథోత్సవం చేపట్టారు. పంచబృందావనాలకు పుష్పాలతోనూ, సిరుగుప్ప రోడ్డులోని యంత్రోద్ధారక రాఘవేంద్రుడికి, రాయల్‌కాలనీ సంజీవరాయ రాఘవేంద్రుడికి రజతకవచం పుష్పాలతోనూ, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా మండలి భక్తుల భక్తికీర్తనలతో రథోత్సవంలో రాఘవేంద్రుడు ఊరేగారు. మహిళలు కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామీజీల ప్రవచనం చేశారు. అన్ని మఠాల్లోనూ భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు సోమశేఖరరెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మఠం వ్యవస్థాపకులు ప్రసన్నాచార్, సురేష్ ఆచార్, నేమకల్లు రావు, అశోక్, గురురాజ్ ఆచార్, డా.శ్రీనాథ్, పాండురంగాచార్, బలరామ ఆచార్, రాఘవేంద్ర ఆచార్, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తేరువీధిలో రాఘవుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

ఈతపోటీల్లో రాణించిన రజని లక్క

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక ఈత సంఘం ఆధ్వర్యంలో గత నెల 29, 30 తేదీల్లో బెంగళూరులోని విజయనగరలో జరిగిన 27వ మాస్టర్స్ ఈత ఛాంపియన్‌షిప్ పోటీల్లో బళ్లారి స్విమ్మర్ రజని లక్క అద్భుత ప్రదర్శన కనబరిచి 5 స్వర్ణ పతకాలను సాధించారు. 65 నుంచి 69 ఏళ్ల మధ్య వయస్సు గల సీనియర్ విభాగంలో పోటీపడిన రజని లక్క 200 మీటర్ల ఐఎం, 100 మీటర్ల బటర్‌ఫ్లై, 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 4×50 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే పోటీల్లో గెలుపొంది ఐదు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ఐదు బంగారు పతకాలు సాధించిన రజని లక్కకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సహకార సంఘం అధ్యక్షుడిగా మరిస్వామి

కంప్లి, న్యూస్‌టుడే: దరోజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్. మరిస్వామి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఉన్న పి.ఎస్. లింగప్ప రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి మరిస్వామి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘం సీఈవో వి. మల్లికార్జున ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడు ఎన్. వి. హనుమంత, నాయకులు వి. జనార్దన్, మాదాపుర మారెప్ప, సంఘం నిర్దేశకులు, సిబ్బంది అధ్యక్షుణ్ని అభినందించారు.

ఎన్. మరిస్వామి

'నిబంధనలకు విరుద్ధంగా భూపంపిణీ'

బళ్లారి, న్యూస్‌టుడే: సమాజ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి.. భూమి లేని వ్యవసాయ కూలీలకు వితరణ చేసే విషయంలో ప్రభుత్వం విధించిన నిబంధనలను గాలికి వదిలేశారు. దీనిపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త సిద్దేశ్ ఉజ్జిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు భూమిని వితరణ చేయడానికి సిరుగుప్ప తాలూకాలో రైతుల నుంచి 100.52 ఎకరాల వ్యవసాయ భూమిని సమాజ సంక్షేమ శాఖ అధికారులు కొనుగోలు చేశారు. వ్యవసాయ కూలీలకు వితరణ చేయడానికి పత్రికల్లో ప్రకటన ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఎలాంటి ప్రకటన ఇవ్వకుండా వ్యవసాయ కూలీల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జాబితాను ఎంపిక చేసిన తర్వాత అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వాలని కోరిన సందర్భంలో ప్రకటన ఇచ్చారని తెలిపారు. భూమిని వితరణ చేసే సందర్భంలో నిబంధనలు పాటించకుండా వితరణ చేసినట్లు పత్రాలను విలేకరులకు విడుదల చేశారు. దీనిపై విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

బళ్లారి, న్యూస్‌టుడే: తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తహీనతను నివారించడానికి గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ దివ్య సూచించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా డా. బి. ఆర్. అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే ఐరన్, కాల్షియం మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలి. వీటితో పాటు, వారి ఆహారంలో మొలకలు, వేరుసెనగలు, బెల్లం, పాలకూర, పండ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి నెలా 9న జరిగే ప్రధాన మంత్రి వివాహ సురక్షా అభియాన్ కింద శిశువును పరీక్షించాలన్నారు. పుట్టిన అరగంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించాలి. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. 12 ప్రాణాంతక వ్యాధులపై టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లా ఆరోగ్య, శిక్షణ అధికారి శివానంద్ మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవం (ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8), బాల్య వివాహాల నిషేధం, హెచ్‌ఐవీ వ్యాక్సినేషన్, అంటువ్యాధులు..నియంత్రణపై వివరించారు. మా క్లినిక్ వైద్య అధికారి డాక్టర్ సాత్విక్ కమిటీ బాధ్యతల గురించి మాట్లాడారు. మేఘరాజ్ దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు, క్షయ, కుష్ఠు వ్యాధుల నిర్మూలనపై వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్య కమిటీ సభ్యులకు శిక్షణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధరామయ్య, నాగమణి, రాఘవేంద్ర, నరేష్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖలో కొలువుల భర్తీ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తపాలా విభాగం పరిధిలోని కార్యాలయాల్లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, తపాలా సేవక్‌లతో సహా మొత్తం 34 గ్రామీణ తపాలా సేవక్ పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ఒకేసారి రిజిస్ట్రేషన్ సెప్టెంబరు 19న సాయంత్రం 5 గంటలలోపు చేసుకోవాలి. దరఖాస్తు సమర్పణ రుసుములు చెల్లింపు ఈ నెల 2 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు, దరఖాస్తుల సవరణ గడువు ఈ నెల 23 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హతలను చూసుకుని నిర్దేశిత గడువులోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారి పేర్కొన్నారు.

పథకాల అమలుకు దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో పోస్ట్-మెట్రిక్ కోర్సుల్లో చదువుతున్న వెనుకబడిన తరగతులు, కేటగిరీ-1 అలెమారి, అరె అలెమారి విద్యార్థులు వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ 2026-27 ఏడాది వివిధ పథకాల సౌకర్యాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోపు దరఖాస్తులు సమర్పించాలని, మరిన్ని వివరాలకు అధికారులను సంప్రదించాలన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలోని ఈద్గామైదానం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు ఆంగ్లం, కన్నడ భాష అతిథి ఉపాధ్యాయుల పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన ఆచార్యుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఆంగ్లమాధ్యమ పాఠశాల అని, ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 557 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రకారం ఆంగ్లభాష సబ్జెక్టు బోధించే ఆంగ్ల భాషా అతిథి ఉపాధ్యాయులు, కన్నడభాషా అతిథి ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల, అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మృతుల ఖాతాలకు బదిలీ అయిన నగదు తిరిగివ్వాలి

గంగావతి, న్యూస్‌టుడే: మృతిచెందిన మహిళల ఖాతాలకు బదిలీ అయిన గృహలక్ష్మీ పథకం నగదు ఆయా కుటుంబాలు తిరిగి చెల్లించాలని జిల్లా గ్యారంటీ పథకాల సమితి అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ సూచించారు. ఆయన సోమవారం కొప్పళలో గ్యారంటీ పథకాల ప్రగతిని సమీక్షించారు. అలాంటి కుటుంబాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఈ నగదును తిరిగి చెల్లించాలని ఇప్పటికే చెప్పామన్నారు. జిల్లాలో 7,086 మంది లబ్ధిదారులు మృతి చెందినట్లు సమీక్షలో తేలిందన్నారు. వీరిలో 2,664 ఖాతాలకు మొత్తం 13,709 కంతుల్లో రూ. 2,74,18,000 నగదు బదిలీ అయిందన్నారు. దీంట్లో రూ. 87,64,608లు ప్రభుత్వానికి తిరిగి చెల్లించారన్నారు. రూ. 1,96,000లను బ్యాంకుల్లో స్తంభింపజేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు మృతి చెందిన తరువాత కుటుంబాలు డ్రా చేసుకున్న మొత్తం రూ. 2,64,147లను తిరిగి చెల్లించాలని కుటుంబ సభ్యులకు నచ్చజెప్పాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో వర్షిత్‌నేగి, సమితి ఉపాధ్యక్షులు ఎస్‌బి ఖాద్రి, మంజునాథ్ గొండబాళ పాల్గొన్నారు.

కొప్పళలో గ్యారంటీ పథకాల ప్రగతిని సమీక్షిస్తున్న జిల్లాధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్

అటు కరవు కాటు.. ఇటు చీడపీడల చేటు

■ కుదేలవుతున్న అన్నదాతలు

కూడ్లిగి తాలూకా కానామడుగులో జొన్న చేలో కంకిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారిణి

హొసపేటె, న్యూస్‌టుడే: అటు సకాలంలో వర్షాలు కురవక తీవ్రమైన కరవు కాటేయడం ఒకవంతైతే.. వ్యవసాయ పంప్‌సెట్లతో పండిస్తున్న పంటకు చీడ పురుగు పడి నిలువునా నాశనం చేయడం మరోవంతు కావడంతో జిల్లాలోని రైతులు కుదేలవుతున్నారు. అరకొర వర్షాలు కురిసినప్పటికీ విజయనగర జిల్లాలోని ఆరు తాలూకాల మెట్టభూముల రైతులు జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను వేశారు. మొక్క మొలిచే సమయానికి వర్షాలు చేతులెత్తేయడంతో మొలకలెత్తలేదు. మరోవైపు పంప్‌సెట్ల ద్వారా వ్యవసాయం చేసే రైతులు వేసిన జొన్న, మొక్కజొన్న పంటలు గొంగళి పురుగుల బెడదతో చేతికందకపోతున్నాయి. కంకి విడిచే సమయంలో జొన్న పంటకు గొంగళి పురుగు పడి ఆదిలోనే కంకిని నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆదిలోనే అవి కంకిని తిని రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఒక్కో కంకిలో కనీసం 50 దాకా గొంగళి పురుగులు చుట్టుముడతున్నాయని రైతులు వాపోతున్నారు.

● **పరిశీలన:** జొన్న పంటలకు గొంగళి పురుగులు పడ్డాయని తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు కూడ్లిగి తాలూకాలోని కానామడుగు ఇతర ప్రాంతాల్లో పంటలు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సలహా ఇస్తూ.. జొన్నకు గొంగళి పురుగు బెడద నివారణకు రైతు మిత్ర కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎమామెక్టిన్ బెంజోయేట్ పొడిని లీటరు నీటిలో కలిపి జొన్నపంటపై పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివారణోపాయాలు తెలుసుకోవాలని కోరారు.

జొన్న కంకిని చుట్టుముట్టిన గొంగళి పురుగులు

అఖండేశ్వర ఆలయంలో నూతన వధూవరులు

అఖండేశ్వర ఆలయంలో సామూహిక వివాహాలు

గంగావతి, న్యూస్‌టుడే: గంగావతి అఖండేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సామూహిక వివాహాలు నిర్వహించారు. తొమ్మిది జంటలు ఒక ఇంటివారయ్యారు. శాసనసభ మాజీ సభ్యుడు పరణ్ణ మునవళ్లి మాట్లాడుతూ మఠాలు, మందిరాలు సామూహిక వివాహాలు నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. పెళ్లిళ్లను ఆడంబరంగా నిర్వహించి అప్పులపాలు కారాదన్నారు. కార్యక్రమంలో ఉలిగప్ప దేవరమని, సణ్ణ హులిగమ్మ, భగవంతప్ప, పరశురామ, మంజునాథ్, దురుగేశ్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న రవి భారతీయ, చిత్రంలో సభ్యులు

రేపు వైద్య శిబిరం

బళ్లారి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల 2న బళ్లారి నగరంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ సభ్యుడు రవి భారతీయ తెలిపారు. సోమవారం ఉదయం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2న పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా మొదటి దుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్నాం. అనంతరం బళ్లారి నగరం కె.ఎస్.ఆర్.టి.సి. కేంద్రీయ బస్సు ప్రాంగణం సమీప లారీ టెర్మినల్‌లోని కార్యాలయంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. నేత్ర చికిత్స, అనంతరం శస్త్రచికిత్స, హృదయ సంబంధ, క్యాన్సర్, నాడీ, మూత్రపిండ సంబంధ రోగాలకు ఉచిత చికిత్సతో పాటు ఔషధాలు వితరణ చేస్తున్నట్లు వివరించారు. బళ్లారి నగరంతో పాటు చుట్టుపక్కల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యులు వెంకటేశులు, తిప్పేస్వామి, పద్మ, శాంతి, సంతోష్ పాల్గొన్నారు.

కంప్లి వలయ-1 క్రీడలు ప్రారంభం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి 8వ వార్డు, సత్యనారాయణ పేటె క్లస్టర్ల పరిధి వలయ-1 ప్రాథమిక పాఠశాల విద్యార్థుల క్రీడలు షామియాచంద్ పాఠశాల మైదానంలో సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీల అధ్యక్షుడు రమేశ్ శివపుర మాట్లాడుతూ తాలూకా పరిధి విద్యార్థుల అనుకూలం కోసం కంప్లిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు తాలూకా, జిల్లా, విభాగ స్థాయి క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. క్రీడా కార్యదర్శి పి. వెంకటరమణ, ఎం. రేవణ్ణ, హనుమంతప్ప, ఎం.ఎ. నాగన గౌడ, టి.ఎం. బసవరాజ్, బీరలింగ పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

కరియప్ప తాత విగ్రహంతో కదిలిన భక్తులు

పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

భక్తిశ్రద్ధలతో కరియప్ప తాత ఉత్సవం

పేటె బసవేశ్వర, కూలికట్టె బసవేశ్వర విగ్రహ ఊరేగింపు

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలో కరియప్ప తాత ఉత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ఆలయంలో మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, తదితర పూజలు జరిపారు. అనంతరం జానపద కళా బృందాలు, మహిళలు పూర్ణ కుంభాలతో వెంట రాగా శరణ బసవేశ్వర ఆలయం నుంచి పల్లకీ ఉత్సవం జరిగింది. కరియప్ప తాత ఆలయ ఆవరణలోని ఆంజనేయ, కాశీ విశ్వనాథ విగ్రహాలకు సైతం పూజలు నిర్వహించారు. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. కారటగితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

★ **కంప్లి బసవేశ్వర ఆలయాల్లో పూజలు:** శ్రావణ మాస మూడో సోమవారం సందర్భంగా పట్టణ ప్రజల ఆరాధ్య దైవాలు పేటె బసవేశ్వర, కూలికట్టె బసవేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం తుంగభద్ర నది నుంచి ఊరేగింపుగా గంగా జలం తెచ్చి విగ్రహాలను అభిషేకించారు. పట్టణ వీధుల్లో బసవేశ్వరుల విగ్రహాలను ఊరేగించారు. ప్రసాద వితరణ జరిగింది. ఆలయ సమితుల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ఇతరాలు అందించిన నిర్వాహకులు

నేటి విద్యార్థులే భవిష్యత్తు నాయకులు

మాన్వి, న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తు రూపకర్తలు విద్యార్థులేనని వారికి ఇప్పటి నుంచే అన్ని వ్యవస్థలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సమాజం మీదుందని సమాజ సేవకుడు శివపూజి బసవరాజ్ గౌడ తెలిపారు. శివపూజి ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చికల్‌పర్వి గ్రామంలోని రుద్రమునీశ్వర ఆంగ్లమాధ్యమ పాఠశాలలో నిర్వహించిన శివపూజి ఈరప్ప గౌడ స్మరణను పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు, మొక్కలను వితరణ చేసి మాట్లాడారు. ప్రముఖులు గిరిధర్‌పూజారి, విరుపయ్య స్వామి, అమరేగౌడ, మల్లనగౌడ, ముక్లూరు రుద్రప్పగౌడ, శివకుమార్‌గౌడ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి నారా ప్రతాప్‌రెడ్డి ఆర్థిక సాయం

బళ్లారి, న్యూస్‌టుడే: భవిష్యత్తులో ప్రముఖ వైద్యుడిగా సేవ చేయాలని ఆకాంక్షించి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చిన విద్యార్థి భరత్ కణవికి శ్రీసాయి సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షుడు, బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి, సతీమణి నారా శైలజారెడ్డి రూ. 75వేలు చెక్కును అందజేశారు. అఖండ బళ్లారి జిల్లా హూవినహడగలి తాలూకా హోళలు గ్రామానికి చెందిన ఈరప్ప కణవి కుమారుడు భరత్ కణవికి కొప్పళ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. కళాశాల ప్రవేశానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న. భరత్ కణవి కష్టాలను గుర్తించి ట్రస్ట్ ద్వారా సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థికి భవిష్యత్తులో ఆర్థిక సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం కార్యదర్శి తిమ్మారెడ్డి, కోశాధికారి హేమచంద్రారెడ్డి, డైరెక్టర్ మరిస్వామిరెడ్డి, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్ఠి రుద్రప్ప, సీనియర్ పాత్రికేయులు మంజునాథ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి, సతీమణి శైలజారెడ్డి, సభ్యులు

2న పరమేశ్వర్ నాయక్ జిల్లా పర్యటన

పి.టి.పరమేశ్వర్ నాయక్

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్ర గ్యారంటీ పథకాల అమలు అథారిటీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి పి.టి. పరమేశ్వర నాయక్ సెప్టెంబరు 2 నుంచి 4 వరకు బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన సెప్టెంబరు 2న బెంగళూరు నుంచి బళ్లారికి చేరుకుని సాయంత్రం 4.30 గంటలకు ప్రభుత్వ అతిథి భవనంలో జిల్లా, తాలూకా స్థాయి గ్యారంటీ కమిటీ అధ్యక్షులు, అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన విజయనగర జిల్లా హొసపేటెకు చేరుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. 3న ఉదయం 10.30 గంటలకు కొప్పళ జిల్లా పంచాయతీ భవనంలో గ్యారంటీ పథక అధ్యక్షులు, సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 4న మధ్యాహ్నం 2.30 గంటలకు విజయనగర జిల్లా హరపనహళ్లి ప్రభుత్వ కళాశాలలో సమావేశం నిర్వహించనున్నారు.

వసతి గృహ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళలోని అంబేడ్కర్ ఎస్సీ-4 వసతి నిలయ సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు సోమవారం జిల్లా పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేశారు. నాలుగు నెలల నుంచి తమకు సోప్‌కిట్లు ఇవ్వడం లేదన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయనందున స్నానం చేసిన అందరికీ దురదలు వస్తున్నాయని ఆరోపించారు. గ్రంథాలయంలో స్వచ్ఛత కరవైందన్నారు. స్పోర్ట్స్ కిట్లు ఇవ్వాలన్నారు. వార్డెన్ సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఏఐడీఎస్ ప్రతినిధులు శరణ గడ్డి, ప్రదీప్, దురుగేశ్, ఎం. శరణబసవ, మల్లికార్జున, పరశురామ పాల్గొన్నారు.

కొప్పళ పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

సిరుగుప్ప సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు పట్టు

బళ్లారి, న్యూస్‌టుడే: వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు సిరుగుప్ప సబ్ రిజిస్ట్రార్ యల్లారెడ్డిపై కేసు నమోదైంది. బెయిల్ కోసం ధార్వాడ హైకోర్టుకు వెళ్లగా తిరస్కరించారు. సబ్ రిజిస్ట్రార్ యల్లారెడ్డిని తక్షణమే పోలీసులు అరెస్టు చేయాలి. వారంలోపు అరెస్టు చేయకపోతే జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు మారుతి హెచ్చరించారు. సోమవారం పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 143.32 ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తున్న రైతులకు బదులుగా వేర్వేరు వ్యక్తుల పేరు మీద రిజిస్టర్ చేయించారు. వ్యవసాయం చేస్తున్న దళిత, గిరిజన రైతులపై దాడికి యత్నించిన రైతులు, సబ్‌రిజిస్ట్రార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై సిరుగుప్ప సబ్ రిజిస్ట్రార్ యల్లారెడ్డి పరారీలో ఉన్నారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా కోర్టు తిరస్కరించింది. తక్షణమే సబ్ రిజిస్ట్రార్ యల్లారెడ్డిని అరెస్టు చేయాలి. రైతులు పాదయాత్ర, డీసీ కార్యాలయం ముందు నిరవధిక సత్యాగ్రహం చేయడంతో జిల్లా పాలనాధికారి స్పందించి విచారించి 143.32 ఎకరాలను ప్రభుత్వ భూమిగా పత్రాల్లో ఎక్కించారు. మూడు తరాలుగా సాగు చేస్తున్న రైతులకే సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. రైతులు మునియప్ప, మల్లయ్య, ఓబులేశ్వరప్ప, గాళప్ప, నాగప్ప, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, చిత్రంలో సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు మారుతి, రైతులు

హొసపేటె - అరసీకెరె రైలు టికెట్ ధర తగ్గింపు

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె - అరసీకెరె నడుమ వారానికి ఐదు రోజులు సంచరిస్తున్న డెము రైలు టికెట్ ధరను రైల్వేశాఖ బాగా తగ్గించింది. ఆగస్టు 28న రైలు ప్రారంభంకాగా, మొదటి రోజు హొసపేటె నుంచి అరిసీకెరెకు రూ. 85 టికెట్ ధర ఖరారు చేశారు. ఈ టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సమానంగా ఉందని విజయనగర రైల్వే వినియోగదారుల సలహా సమితి ప్రముఖులు హుబ్బళ్లి విభాగం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు సోమవారం నుంచి టికెట్ ధరను రూ. 35 ఖరారు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ రెండు కేంద్రాల నడుమ బస్సుకు టికెట్ ధర రూ. 170 ఉంది. వెంటనే స్పందించి టికెట్ ధరను తగ్గించినందుకు సమితి ప్రముఖులు యమునేశ్, కుడతిని మహేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

31-08-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1630.60	1625.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,850	61,681
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,892	69,775
నీటి నిల్వ (టి.ఎం.సి)	96.343	77.542

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

భక్తజన మందార.. గురు రాఘవేంద్ర

ముగిసిన ఆరాధనోత్సవాలు

హొసపేటె: పట్టణంలోని జగళీకట్టె రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్తరారాధనలో పాల్గొని కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

హొసపేటె, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల ఆరాధనా మహోత్సవాలు సోమవారం జరిగిన ఉత్తరారాధనతో ఘనంగా ముగిశాయి. పట్టణం, కమలాపురలోని రాఘవేంద్ర స్వాముల మఠాల్లో జరిగిన ఉత్తరారాధన మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణంలోని ఉత్తరాధి మఠం, రాణిపేట్, నెహ్రూకాలనీ, జగళీకట్టి ప్రాంతాల్లో స్వాములవారి బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. కమలాపురలో భక్తులు స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖులు భీమసేనాచార్, పవనాచార్, అనిలాచార్, విజయేంద్ర దేసాయి, అనంతపద్మనాభరావు, శిరెకొళ్ల గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంగావతి: రాఘవేంద్రస్వామి ఉత్తరారాధన పురస్కరించుకొని గంగావతిలో రథోత్సవాన్ని సోమవారం ఘనంగా ఆచరించారు. రాఘవేంద్రుల ఉత్సవమూర్తిని రథంలో ప్రతిష్ఠించి పట్టణంలో ఊరేగించారు. ఉత్సవం రాయరమఠం నుంచి ప్రారంభమైంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భజనలు చేసి కీర్తనలు ఆలపించారు.

కంప్లిలో ప్రత్యేక అలంకరణలో రాయల బృందావనం

కంప్లి: కంప్లి సత్యనారాయణ పేటె నంజనగూడు రాఘవేంద్ర స్వామి మఠంలో సోమవారం మూడో రోజు ఉత్తరారాధన భక్తిశ్రద్ధలతో జరిగింది. అభిషేకం తదితర ధార్మిక కార్యక్రమాల అనంతరం ఆలయ ఆవరణలో రథోత్సవం నిర్వహించారు. రాయల భజన జరిగింది. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. మఠం నిర్వాహకులు, గురురాజ సేవా మండలి ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కమలాపురలో రాఘవేంద్రుల ఉత్తరారాధనలో పాల్గొన్న భక్తులు

★ **కారటగిలో గ్రామ ప్రదక్షిణ:** కారటగిలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్తరారాధన జరిగింది. అభిషేకం తదితర పూజల అనంతరం రాయల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పల్లకీ ఉత్సవం ప్రారంభమైంది. మహిళా భజనా మండలి సభ్యులతో పల్లకీ ఉత్సవంతో గ్రామ ప్రదక్షిణ జరిపారు. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంగావతిలో రాఘవేంద్రుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కారటగిలో రాయల పల్లకీ ఉత్సవంతో గ్రామ ప్రదక్షిణ

మాన్వి, న్యూస్‌టుడే: స్థానిక రాఘవేంద్రస్వామి మఠంలో గురు రాఘవేంద్రస్వామివారి ఆరాధనా మహోత్సవ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 3 రోజుల పాటు నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాల్లో బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయాల ఆధ్వర్యంలో మఠంలో వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు బృందావన దర్శనం చేసుకొని రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్పనాయక్ కుటుంబసభ్యులు ఆరాధనా ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రథోత్సవం వద్ద భక్తులు

(c) eenadu

ఉద్యాననగరిలో విదేశీ పక్షుల కువకువలు!



రాజధాని శివార్లలో అగర చెరువుకు జలకళ

ఆకట్టుకునే విదేశీ పక్షి

ఆహారం వేట షురూ...

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో వందెకరాల విస్తీర్ణంలో ఉన్న అగర చెరువు వద్దకు వివిధ జాతుల దేశ, విదేశీ పక్షుల రాక మొదలైంది. చెరువులో నీరు ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని, పక్షులు రాకతో చెరువులకు నిండుదనం వచ్చిందని పరిసరవాదులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు మూడు నెలలు పక్షులు ఇక్కడే ఉండి మళ్లీ తమ ప్రాంతాలకు వెళ్లిపోతాయి. పక్షుల కోసం చెరువు మధ్యలో ఐల్యాండ్ ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ దట్టమైన వృక్షాలు ఉన్నాయి. చెరువులో చేపలు, ఇతర పురుగులు ఉండటంతో పక్షులకు ఆహార కొరత ఉండదు. కొంగలతో పాటు వివిధ జాతుల పక్షులు ఏటా వస్తుంటాయి. కేరళం, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు శ్రీలంక, మలేసియా, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి పక్షులు వస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అగర చెరువు సంరక్షణ సమితి సభ్యులు నిరంతరం చెరువు నీరు పరిశుభ్రత, చుట్టు పక్కల స్వచ్ఛత కోసం శ్రమిస్తున్నారు. ఇక్కడ పక్షులు కొంత కాలం ఉండేందుకు అనుగుణంగా చెట్లపై కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేశారు. పక్షులను తమ కెమెరాల్లో బంధించేందుకు పరిసర ప్రేమికులు సెలవు దినాల్లో చెరువు వద్ద మకాం వేస్తారు. ప్రభుత్వం చెరువును బాగా అభివృద్ధి చేసింది. చుట్టూ నడకదారి, ఉద్యానవనాలు, బయలు వ్యాయామశాలను ఏర్పాటు చేశారు. మురుగునీరు నేరుగా చెరువులోకి రాకుండా శుద్ధీకరణ చర్యలు చేపట్టారు.

చెరువు వద్ద కొంగ

తెల్లకొంగ భలే..

సృష్టి మంజునాథ్.. విశ్వ సాధన!

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ప్రతిభ, సామర్థ్యంతోనే గొప్ప అవకాశాలు పొందుతారనేందుకు ఈ విజయం నిదర్శనం. గ్రామీణ నేపథ్యం ఉన్న ఓ రైతు కుమార్తె అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. హావేరిలోని హట్టిమట్టూరు గ్రామానికి చెందిన సృష్టి మంజునాథ్ ఉల్లగడి అనే యువతి గ్లోబల్ పేమెంట్ సాంకేతిక కంపెనీ 'వీసా'లో రూ.46.33 లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందడం విశేషం. మూడబిదిరే ఆళ్వాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈమె ఫైనలియర్ చదువుతోంది. ఆళ్వాస్ విద్యార్థులకు వృత్తిపరమైన అభివృద్ధి కోసం ఇంటర్న్‌షిప్‌లకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఆమెకు 'వీసా'లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభించింది. 10 వారాల ఇంటర్న్‌షిప్ సమయంలో ఆమె రూ.90వేల ఉపకారవేతనంతో పనిచేస్తూ తన సాంకేతికత పరిజ్ఞానాన్ని, పనితీరును నిరూపించుకుంది.

● సృష్టి సాధించిన ఈ సాధనకు ఆళ్వాస్ విద్యా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.మోహన్ ఆళ్వా సోమవారం అభినందనలు తెలిపారు. గ్రామీణ నేపథ్యం ఉన్న వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన సృష్టి తన ప్రతిభ, కృషి, పనితీరుతో ఒక అంతర్జాతీయ సంస్థలో అవకాశం పొందడం అద్భుతమన్నారు. తమ విద్యార్థిని సాధించిన ఈ విజయానికి ట్రస్టీ వివేక్‌ఆళ్వా, అధ్యాపక బృందం అభినందించారు.

అధ్యాపకులు, వివేక్‌ఆళ్వాతో సృష్టి

సెల్‌ఫోన్ ఇవ్వలేదని.. అన్నను చంపిన తమ్ముడు

మంగళూరు, న్యూస్‌టుడే : సెల్‌ఫోన్ విషయంలో జరిగిన గొడవలో అడివెప్ప (40) అనే వ్యక్తిని అతని తమ్ముడు రాజు (36) కిరాతకంగా కడతేర్చాడు. బెళగావి జిల్లా బైలహొంగలకు చెందిన వీరి కుటుంబ సభ్యులు కూలి పనులు చేసుకునేందుకు కొట్టారు క్రాస్‌కు వచ్చి బాడుగ ఇంట్లో ఉంటున్నారు. వీరి తల్లి కిరాణా కొట్టు నిర్వహించేది. ఆదివారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి ఇంటికి వచ్చారు. సెల్‌ఫోన్ కోసం ఇద్దరూ గొడవపడ్డారు. ఆగ్రహించిన తమ్ముడు పక్కనే ఉన్న కత్తిని అందుకుని అన్నను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం వెన్‌లాక్ ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. మంగళూరు ఊర్వ ఠాణా పోలీసులు హంతకుడ్ని అరెస్టు చేసినట్లు కమిషనర్ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రవికాంతే గౌడ పదవీవిరమణ

దావణగెరె, న్యూస్‌టుడే : కర్ణాటక తూర్పు వలయం ఐజీపీ డాక్టర్ బీఆర్ రవికాంతే గౌడ సోమవారం పదవీ విరమణ చేశారు. మండ్య జిల్లాకు చెందిన ఆయన 1997లో పోలీసు సేవల్లో చేరారు. కర్ణాటక పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని బెంగళూరు గ్రామీణ జిల్లాలో డీవైఎస్పీగా విధులు నిర్వహించారు. హుబ్బళ్లి- ధార్వాడ, మైసూరు, దక్షిణ కన్నడ, బెళగావిలో సేవలు అందించారు. బెంగళూరు ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్‌గా సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి, రాష్ట్రపతి పతకాలను అందుకున్నారు. దావణగెరె జిల్లా పోలీసు కవాతు మైదానంలో సోమవారం సిబ్బంది నుంచి గౌరవ వందనం అందుకుని, పదవీ విరమణ చేశారు.

సైబర్ నేరగాళ్ల విశ్వరూపం

ఏడునెలల్లో రూ.558 కోట్లు హాంఫట్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కర్ణాటకలో నానాటికీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. గత ఏడు నెలల్లో ప్రజల నుంచి రూ.558 కోట్లను ఈ నేరగాళ్లు కొట్టివేశారు. ఫిర్యాదుల అనంతరం బాధితులకు చేరింది రూ.1.9 కోట్లు మాత్రమే. వంచన జరిగిన వెంటనే ఫిర్యాదులు చేయడంతో రూ.35.9 కోట్ల నగదును ఫ్రీజ్ చేయగలిగినా, దాన్ని బాధితుల ఖాతాలకు మళ్లించడంలో జాప్యం జరుగుతోంది. భారతదేశానికి సిలికాన్ వ్యాలీగా బెంగళూరుకు గుర్తింపు ఉన్నప్పటికీ పోలీసుల వద్ద సైబర్ నిపుణుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఈ కేసుల దర్యాప్తు మందగతిన నడుస్తోంది. బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌లోని సైబర్ ఠాణాలో 200 పోస్టులతో కలిపి నగర వ్యాప్తంగా 320 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 2024లో 17,890 కేసులు నమోదు కాగా, రూ.1841 కోట్లను ప్రజలు పోగొట్టుకున్నారు. అందులో రూ.183.6 కోట్లను మాత్రమే బాధితులకు తిరిగి అందించగలిగారు. గత ఏడాది 10,703 కేసులు నమోదు కాగా, రూ.1,756.6 కోట్లను ప్రజలు పోగొట్టుకోగా, రూ.158.5 కోట్లను మాత్రమే రికవరీ చేసి బాధితులకు అందించగలిగారు. ఈ ఏడాది నమోదైన కేసులు తక్కువగానే ఉన్నాయి. ప్రజల్లో జాగృతి రావడమే ఇందుకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

'సొరంగ' మార్గంలోనూ ఆటంకాలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మేఖ్రి కూడలి నుంచి హెబ్బాళ వరకు రూ.1139.67 కోట్లతో 2.2 కి.మీ. పొడవునా బీడీఏ నిర్మించ తలపెట్టిన ఆరు వరుసల సొరంగ మార్గంతో ప్రయోజనాల కన్నా సమస్యలే ఎక్కువని భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్సీ) తన అధ్యయన నివేదికలో హెచ్చరించింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఏఎంఆర్ ఇండియా భాగస్వామ్యంతో పనులు ప్రారంభమయ్యాయి. భారతీయ విజ్ఞాన సంస్థలోని సస్టెయినబుల్ ట్రాన్స్‌పోర్టేషన్ ల్యాబ్‌కు చెందిన ఆచార్య ఆశిశ్ వర్మ నేతృత్వంలోని అధ్యయన బృందం ఈ ప్రాజెక్టు ద్వారా పలు సమస్యలు వస్తాయని పేర్కొంది. భారీ వర్షం కురిసినప్పుడు హెబ్బాళ వైపు నుంచి సొరంగంలోకి నీరు వస్తాయని, దానితో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. దీనితో పాటు చెట్లను కొట్టివేయవలసి ఉండడం, మేఖ్రి, హెబ్బాళ కూడళ్లకు అవతలా, ఇవతలా వాహన రద్దీ సమస్యలు తీవ్రం అవుతాయని ఆ అధ్యయన నివేదికలో పేర్కొన్నారు.



హెబ్బాళలో ప్రతిపాదిత సొరంగ మార్గమిదీ

సిద్ధు, యతీంద్రకు సెగ

మైసూరు, న్యూస్‌టుడే : ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి డాక్టర్ యతీంద్రలను మైసూరు సమీప మండహళ్లి వద్ద రైతులు అడ్డుకున్నారు. తమ గ్రామాల్లో 165 ఎకరాల భూమిని కర్ణాటక పారిశ్రామికాభివృద్ధి మండలి బలవంతంగా లాక్కొంటోందని ఆరోపిస్తూ వారిని ఘెరావ్ చేశారు. తమ భూములను ఇవ్వబోమని, బలవంతంగా లాక్కొనకుండా సహకారం ఇవ్వాలని వినతిపత్రాన్ని అందించారు. వెనక కార్లలో వచ్చిన ఎమ్మెల్యేలు డి.రవిశంకర్, దర్శన్ ధ్రువనారాయణ్‌లు రైతులను సమాధానపరచి అక్కడి నుంచి పంపించారు.

మండ్య జైలర్ శాంతమ్మ బళ్లారికి బదిలీ

మండ్య, న్యూస్‌టుడే : ఖైదీలకు కారాగారంలో సదుపాయాలు కల్పించేందుకు వారి కుటుంబ సభ్యుల నుంచి నగదు తీసుకుంటున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మండ్య జిల్లా కారాగారం జైలర్ శాంతమ్మను బళ్లారి కారాగారానికి బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారి అలోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మండ్య జిల్లా ఆసుపత్రిలో ఒక ఖైదీకి రాజాతిథ్యం ఇవ్వడంతో పాటు, అతని ప్రియురాలిని కూడా ఆ గదిలోకి అనుమతించినట్లు లోకాయుక్త అధికారులు గుర్తించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని కారాగార శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో కారాగారం అధికారుల వైఫల్యం ఉన్నట్లు గుర్తించి, ఆమెను బళ్లారి కారాగారానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విహారానికి 'డబుల్' ధమాకా!



పర్యాటకుల విహారానికి చక్కని వాహనమిదిగో..

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : మూడు దశాబ్దాల కిందటి వరకు బెంగళూరులో కొన్ని మార్గాల్లో డబుల్ డెక్కర్ బస్సులు తిరిగేవి. క్రమేణా ఆయా ప్రాంతాల్లో వంతెనలు, బిలమార్గాలు నిర్మించడంతో కొత్త తరహా బస్సులు రంగ ప్రవేశం చేశాయి. డబుల్ డెక్కర్లు షెడ్డుకు చేరాయి. లండన్ తరహాలో బెంగళూరులోనూ డబుల్ డెక్కర్ బస్సులను పర్యాటకుల కోసం వినియోగించాలని కర్ణాటక పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ యోచిస్తోంది. మొత్తం 44 ఆసనాలు ఉండే ఈ బస్సులో దిగువ 24 కుర్చీలుంటాయి. టాప్ లేని పైభాగంలో 20 మంది కూర్చుని ప్రయాణించవచ్చు. ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు నగరంలోని వివిధ భాగాల్లో ఈ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని అధికారులు తెలిపారు. ఒక ట్రిప్పు ప్రయాణానికి ఒక్కోరి నుంచి రూ.180 వసూలు చేస్తామని చెప్పారు. విధానసౌధ, వికాససౌధ, కబ్బన్ ఉద్యానవనం తదితర ప్రాంతాల్లో ఈ బస్సును తిప్పేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు.

భార్య హింస భరించలేక విడాకులు పొందిన భర్త

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : తన భార్య నిత్యం శారీరకంగా, మానసికంగా హింసిస్తోందంటూ వేసుకున్న అర్జీపై ఉన్నత న్యాయస్థానం విచారణను పూర్తి చేసింది. మైసూరుకు చెందిన దంపతులకు విడాకులు మంజూరు చేసింది. భార్యకు ఏకమొత్తంగా రూ.17 లక్షల మనోవర్తి ఇవ్వాలని జస్టిస్ డీకే సింగ్, జస్టిస్ హెచ్.శాంతిభూషణ్‌ల పీఠం ఆదేశించింది.

పడమట నిత్యం జీవనసమరమే



పడమటి కనుమల నీడన జీవనానికి ఆటంకాలెన్నెన్నో

బీవై రాఘవేంద్ర

ప్రత్యేక సభాపర్వానికి రాఘవేంద్ర సూచన

శివమొగ్గ, న్యూస్‌టుడే : కస్తూరి రంగన్ ఇచ్చిన నివేదికను అమలులోకి తీసుకువచ్చేందుకు ముందస్తుగా పశ్చిమ కనుమల్లో భౌగోళిక సమీక్ష నిర్వహించాలని శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అడవి, రిజర్వు అటవీభూమి, కొండలతో పాటు రైతులకు చెందిన పొలాలను కూడా ప్రభుత్వం స్వాధీనపరుచుకోకుండా నివేదికను అమలు చేయవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. కస్తూరి రంగన్ నివేదిక కోసం ప్రత్యేకంగా ఒక రోజు శాసనసభ సమావేశాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను తాము స్వాగతిస్తామని చెప్పారు. కేరళం ప్రభుత్వం ఇప్పటికే నిర్వహించిన సమీక్ష తరహాలో ఇక్కడా ప్రత్యేకంగా సమీక్ష అవసరమని సూచించారు. అడవులకు సరిహద్దుగా ఉన్న గ్రామాలను కూడా నివేదికలో చేసిన సిఫార్సులకు దూరంగా ఉంచాలని కోరుతున్నామని చెప్పారు. నివేదికలోని సిఫార్సుల ప్రకారం పశ్చిమ కనుమల పరిధిలో సేద్యంలో ఎటువంటి రసాయనిక ఎరువులను వినియోగించకూడదని చెప్పారు. గ్రామాల్లో విద్యుత్తు, రవాణా, బ్యాంకులు, రహదారులు, వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మృత్యువాత పడిన కుటుంబాలకు పరిహారం ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కస్తూరి రంగన్ నివేదికను అమలు చేసేందుకు ఇప్పటి వరకు ఏడుసార్లు నోటిఫికేషన్ జారీ అయినప్పటికీ వాటిని ప్రజలు, చట్టసభ ప్రతినిధులు వ్యతిరేకిస్తూ వచ్చారని గుర్తు చేశారు. పశ్చిమ కనుమల్లోని 16 వేల చ.కి.మీ. అడవిని నివేదికలోని సిఫార్సుల నుంచి తొలగించవలసిన అవసరాన్ని వివరించారు. కస్తూరి రంగన్ నివేదికను జారీ చేయకూడదని పశ్చిమ కనుమల రైతు సహకార వేదిక తరఫున శివమొగ్గ జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు చేస్తామని తెలిపారు.

బంద్‌కు నామమాత్రపు స్పందన

మంగళూరు, న్యూస్‌టుడే : ఇటీవల దర్బెలో చోటుచేసుకున్న ఘర్షణలను వ్యతిరేకిస్తూ భాజపా, హిందూ సంఘాలు ఇచ్చిన పుత్తూరు బంద్ పిలుపునకు నామమాత్రపు స్పందన లభించింది. పుత్తూరు చలో పేరిట ఇచ్చిన పిలుపుతో పట్టణంలో ఉదయం తొమ్మిది వరకు సందడి కనిపించలేదు. మధ్యాహ్నం 12 నుంచి పట్టణ జీవితం ఒక గాడిన పడింది. విద్యా సంస్థలు పూర్తిగా మూతపడగా, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు మధ్యాహ్నం నుంచి తెరుచుకున్నాయి. ఆయా సంఘాల కార్యకర్తలు ప్రధాన వీధుల్లో శాంతియుతంగా కవాతు నిర్వహించారు. భద్రత కోసం ఒక అదనపు ఎస్పీ, ఒక డీవైఎస్పీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 14 మంది ఏఎస్సైలు, 139 మంది కానిస్టేబుళ్లను రంగంలోకి దించారు. వీరితో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, కేఎస్ఆర్పీ, ఎస్ఏఎఫ్, డీఏఆర్ దళ సిబ్బంది కూడా విధులు నిర్వహించారు. ఘర్షణలకు తావివ్వవద్దని పోలీసులు ముందు జాగ్రత్తగా చేపట్టిన ప్రచారం చక్కని ఫలితాన్ని ఇచ్చింది.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు

ఉపరితల వంతెనలపై నిర్బంధం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : నగరంలోని ప్రముఖ రహదారులపై భారీ వాహనాల రాకపోకలు కట్టడి చేస్తూ నిర్బంధాన్ని విధించారు. ఈ మేరకు పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే శుక్రవారం నుంచి ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయి. మైసూరు రోడ్డు బీజీఎస్ ఉపరితల వంతెనపై సరకులు తరలించే భారీ వాహనాలు, పీణ్య ఎలివేటెడ్ కారిడార్‌లో ఆటోలు, మూడు చక్రాల గూడ్సు ఆటోలు, సరకులు తరలించే భారీ వాహనాల రాకపోకలు అడ్డుకుంటారు. ఉదయం 7 నుంచి 11, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 వరకు ఈ నిర్బంధం అమలులో ఉంటుంది. సిల్కుబోర్డు- రాగిగుడ్డ మధ్య డబుల్ డెక్కర్ ఉపరితల వంతెనపై భారీ సరకుల వాహనాలకు, సంజీవనగర క్రాస్ నుంచి విద్యాశిల్ప కూడలి వరకు అంతర్జాతీయ విమానాశ్రయం రోడ్డులోని ఎలివేటెడ్ కారిడార్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోలకు రోజంతా నిర్బంధం ఉంటుంది. ఎలక్ట్రానిక్ సిటీ ఎలివేటెడ్ కారిడార్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, గూడ్సు ఆటోలకు రోజంతా నిషేధం ఉంటుంది. ఇదే మార్గంలో సరకులు తరలించే భారీ వాహనాలు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు తిరగనివ్వరు. వాహన రద్దీ, వంతెనలపై సంభవించే ప్రమాదాలను తగ్గించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	105
క్యారెట్-	115
బీరకాయలు-	70
క్యాబేజీ-	45
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	50
సొరకాయ-	55
దొండకాయలు-	55
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	125
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	65
ఉల్లి(సాధారణ)-	55
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	225
బీట్‌రూట్-	55
వంకాయలు-	50
బెండకాయలు-	45
ముల్లంగి-	50
నిమ్మకాయ-	255
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	375
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	385
అరటి కాయలు-	45
సపోటా-	45
పైనాపిల్-	55
బొప్పాయి-	45
ఆరంజి-	195
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

కుమారకు ఖర్గే ప్రతిసవాల్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలో ఇంజినీర్ల నియామకాల్లో తన పాత్ర ఉన్నట్లు రుజువు చేస్తే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని హోం మంత్రి ప్రియాంక్‌ఖర్గే తెలిపారు. కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన ఆరోపణలు తప్పయితే రాజకీయాల నుంచి వైదొలుగుతారా? అని సవాల్ చేశారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేపీఎస్సీ నియామకాల్లో మంత్రికి ఎలాంటి సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. ఇంజినీర్ల నియామకాల్లో తన పాత్ర ఉన్నట్లు రుజువు చేస్తే తనతో పాటు తన కుటుంబ సభ్యులు రాజకీయాల్లోకి రారని స్పష్టం చేశారు. కుమారస్వామి అవాస్తవాలతో కూడిన ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రుజువు పత్రాలేవీ లేకుండా హిట్ అండ్ రన్ చేస్తున్నారని, ఇది మంచిది కాదన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి ఇటీవల ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయనకు సూచించినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పుడు పోరాటాలను కేంద్ర మంత్రి కుమారస్వామి గుత్తకు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. కేపీఎస్సీలో అక్రమాలు జరుగుతున్న విషయం అందరికీ తెలుసని, అక్కడ జరిగే అక్రమాలకు తనకేమి సంబంధమని ప్రశ్నించారు.

లిఫ్టులో చిక్కుకున్న అసోం వ్యక్తి

మంగళూరు, న్యూస్‌టుడే : పాండేశ్వర ఠాణా పరిధి శ్రీనివాస కళాశాల ఎదురుగా ఉన్న మిజార్ అపార్ట్‌మెంట్ లిఫ్టులో అసోంకు చెందిన కేశవ (33) చిక్కుకున్నారు. సిగ్నల్ లేకపోవడంతో లిఫ్టులోనే రెండు గంటల పాటు గడిపారు. పోలీసులతో కలిసి వచ్చిన అగ్నిమాపకదళ సిబ్బంది కేశవను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అపార్ట్‌మెంట్లన్నీ పాతవి కావడంతో లిఫ్టులను మరమ్మతు చేయించుకోవాలని సూచించినట్లు అగ్నిమాపక దళ అధికారి హరిశ్చంద్ర తెలిపారు.

పరమత సహనం చాటిన సామూహిక వివాహ ఘట్టం

గదగ, న్యూస్‌టుడే : గదగ బెడగేరి ఈద్గా మైదానం సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వివాహ ఘట్టం పదుగురిని ఆలోచింప చేసింది. ముస్లిం యువతతో పాటు హిందూ జంటలకూ ఒకే వేదికపై వివాహాలు జరిపించారు. వారివారి సంప్రదాయల ప్రకారం ఈ ఘట్టం కొనసాగించడం ఆకట్టుకుంది. 18 హిందూ జంటలు, 15 మంది ముస్లిం జంటలు ఇక్కడ పెళ్లి చేసుకోవడానికి వారివారి మత పెద్దలు సహకరించారు. వచ్చిన వారందరికీ భోజన సదుపాయాలూ కల్పించిన నిర్వాహకులు పదుగురి మన్ననలు పొందారు.

అభిజిత్‌గౌడకు నేపాల్‌లో కన్నడిగుల రక్షణ బాధ్యతలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నేపాల్ జల ప్రళయంలో చిక్కుకున్న కన్నడిగులను గుర్తించి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి అభిజిత్‌గౌడను నోడల్ అధికారిగా నియమించారు. ఆదివారం రాత్రి హఠాత్తుగా దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అర్ధరాత్రి వరకు కర్ణాటక భవన్‌లో స్థానిక కమిషనర్ సమీర్‌శుక్లాతో చర్చించారు. నేపాల్‌లో ఉన్న కన్నడిగులు వివరాలు తెలుసుకున్నారు. జలప్రళయంలో 33 మంది కన్నడిగులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఇద్దరిని రాష్ట్రానికి తీసుకొచ్చారు. మిగతావారి కోసం గాలిస్తున్నారు. అక్కడున్న వారిని రాష్ట్రానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు అభిజిత్‌గౌడను నోడల్ అధికారిగా నియమించారు. ఆయన కేంద్ర విదేశాంగ శాఖ సచివాలయంతో కన్నడిగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కన్నడిగులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మొదట దిల్లీకి తీసుకొచ్చి అక్కడే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కర్ణాటక తరలిస్తామన్నారు.

పల్లె సమస్యలకు 'డ్యాష్‌బోర్డ్' పరిష్కారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ సేవలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే వినతిపత్రాలను నమోదు చేసేందుకు డ్యాష్‌బోర్డు ఆధారి ఆన్‌లైన్ వ్యవస్థ సిద్ధం చేస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి పంచాయతీ శాఖ మంత్రి ఈశ్వర్ బి.ఖంద్రే తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సంబంధిత శాఖ ప్రధాన కార్యదర్శికి లిఖిత పూర్వక సూచనలు ఇచ్చారు. పలు సమస్యలపై వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి పరిష్కరించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఫిర్యాదులకు అధికారులు స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. శాఖలో పారదర్శకత తెచ్చేందుకు ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు మంత్రి తెలిపారు.

'నీలి కురంజి' వన సోయగాలు

పడమటి కనుమలను మురిపిస్తున్న నీలి కురంజి పూలు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : కుదురేముఖ బెట్టలపై ఈ ఏడాది నీలి కురంజి పుష్పాలు వికసించాయి. వీటిని ఇష్టం వచ్చినట్లు కోయకుండా, నాశనం చేయకుండా అటవీ, పర్యాటక శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక పాలక మండళ్ల నియమాలకు అనుగుణంగా పర్యాటకులు నడుచుకోవాలని సూచించారు. కుదురేముఖ ప్రాంతంలో 2022-23లో ఎక్కువ విస్తీర్ణంలో నీలికురంజి కనిపించగా, ఈ ఏడాది చాలా తక్కువ సంఖ్యలో ఇవి వికసించాయి. ఈ పూలు వికసించిన చోట భద్రతను కూడా కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. వీటిని వీక్షించేందుకు వెళ్లే వారు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పారబోయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కేజే జార్జ్ వివరించారు.

బోనులో పడిన పులి

బోనులో పడిన పులి

మైసూరు, న్యూస్‌టుడే : గత కొద్ది రోజులుగా హెగ్గడదేవన కోటె తాలూకా హొసహొళలు గ్రామం చుట్టుపక్కల సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్న పులి ఎట్టకేలకు బోనులో పడింది. హొసహొళలు గ్రామంలోని ఒక పొలంలో ఉంచిన బోనులో చిక్కుకున్న పులిని స్థానికులు సోమవారం ఉదయం గుర్తించి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ పులిని కబిని బ్యాక్ వాటర్ పరిధిలోని కాకనకోటె అటవీ విభాగంలో విడిచి పెడతామని ఆర్ఎఫ్ఓ హనుమంతరాజు తెలిపారు.

ఆమె వచ్చేదాకా.. దిగేదే లేదు

టవర్‌పైన ఉన్న రాజా

గంగావతి,న్యూస్‌టుడే: ప్రేమించిన యువతితో పెళ్లి కోసం ప్రేమికుడు సెల్ టవర్ ఎక్కి హంగామా సృష్టించిన సంఘటన గంగావతి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. గంగావతి తాలూకా హణవాళకు చెందిన రాజా అనే యువకుడు దేవదుర్గకు చెందిన యువతిని ప్రేమించాడు. యువతి కుటుంబ సభ్యులు ఏమన్నారో తెలీదు. యువకుడు మాత్రం టవర్ ఎక్కి కూర్చున్నాడు. గంగావతి ఏపీఎంసీ ఆవరణలో ఉన్న టవర్ ఎక్కడం చూసిన కొందరు మరమ్మతుల కోసం వచ్చిన కార్మికుడు అనుకున్నారు. టవర్ ఎక్కగానే ప్రేయసి కోసం కేకలు వేస్తూ ఆమెను తీసుకురావాలని డిమాండ్ చేశాడు. లేకపోతే పైనుంచి దూకేస్తానని బెదిరించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపకదళం సంఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నాలు చేశారు. యువకుడు మాత్రం ప్రేయసి వచ్చేదాకా టవర్ దిగనంటూ భీష్మించుకు కూర్చున్నాడు. రాత్రి ఏడు గంటలైనా యువకుడు అక్కడే కూర్చోవడంతో అతడిని ఎలా రక్షించాలనే విషయంలో పోలీసులు తర్జనభర్జనలు పడుతున్నారు.

(c) eenadu

బెంగళూరు
● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అలంకరణలో అమ్మవారు

ద్రౌపదమ్మదేవికి ప్రత్యేక పూజలు

ముళబాగిలు, న్యూస్‌టుడే : పల్లిగరపాళ్యలో ద్రౌపదమ్మదేవి జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తులు దేవిని సందర్శించారు. పట్టణ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. సోమేశ్వరపాళ్యలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రుడి రథోత్సవం

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలలో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి పట్టణ ప్రధాన వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు భజనలు చేస్తూ రథాన్ని లాగారు. మూల బృందావనాన్ని వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ జడ్పీ అధ్యక్షుడు సౌభాగ్య, బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనవాహిని మధ్య రథాన్ని లాగుతున్న భక్తులు

హోసూరు కబుర్లు

వైవీఎస్ రెడ్డికి సేవారత్న పురస్కారం



వైవీఎస్ రెడ్డి

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరులో పలు సంఘాల ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న డాక్టర్ వై.వి.ఎస్.రెడ్డి (వై.వెంకటస్వామిరెడ్డి) జీవ్‌రాన్ ఫౌండేషన్ ద్వారా సంస్థ అటల్ బిహారీ వాజ్‌పేయీ సేవారత్న సమాన్ ప్రశస్తిని దిల్లీలో అందుకున్నారు. అవార్డు గ్రహీతను హోసూరులోని పలు సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రముఖులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాడు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు సమీపం కెలమంగలంలోని సిద్ధలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, నిర్వహణకు సాయపడతామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీఎరవిశంకర్ గురూజీ హామీ ఇచ్చారు. కె.బి.సిద్ధప్ప నేతృత్వంలో ఆలయ నిర్వాహకులు బెంగళూరు కన్నకపుర రోడ్డులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమానికి వెళ్లి గురూజీని కలిసి ఆలయ గురించి వివరించారు. ఆలయంలో నిత్య పూజలు నిర్వహించడానికి, అర్చకుల నియామకంపై తన కార్యాలయ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని గురూజీ హామీ ఇచ్చినట్లు కె.బి.సిద్ధప్ప తెలిపారు. గురూజీని కలిసిన వారిలో టి.వి.ఎస్.శ్రీరాం, ఎన్.కృష్ణన్, సౌందరరాజన్, హొన్నుగుర్కి సీనప్ప, తదితరులు ఉన్నారు.

రవిశంకర్ గురూజీతో ఆలయ నిర్వాహకులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

శూళగిరి (డెంకణీకోట) న్యూస్‌టుడే : వేపనపల్లి నియోజకవర్గం శూలగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వేపనపల్లి ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అత్యవసర వసతులు, ఆరోగ్యం, విద్య, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంకే యూనియన్ కార్యదర్శి అబ్బయ్య, వెంకటేశ్, మహేశ్వరి, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

రిబ్బన్ కత్తిరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, తదితరులు

ఆటల పోటీల్లో నాగమంగలం ప్రథమం

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : కోయంబత్తూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో కెలమంగలం శివారు నాగమంగలం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. సోమవారం నాగమంగలం పాఠశాలలో యూనియన్ విద్యాధికారి సుధాకర్, ఉపాధ్యాయ శిక్షకులు, అధికారులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులలో ఉపాధ్యాయులు, శిక్షకులు

కల్యాణ వెంకన్నకు బంగారు కంకణం వితరణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారికి భక్తులు 16.260 గ్రాముల బరువు గల రూ.2,82,529 లక్షల విలువైన బంగారు బ్రాస్‌లెట్‌ను వితరణగా అందించారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన పరమేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులు సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మిని కలిసి బ్రాస్‌లెట్ అందించారు.

బ్రాస్‌లెట్‌ను ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

చెత్త విభజనకు తొలి ప్రాధాన్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వంటింట్లో పోగవుతున్న చెత్తను విభజిస్తే సగం సమస్య పరిష్కారమవుతుందని, ప్రజలు పొడి, పచ్చి చెత్త వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులు అందించాలని బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ సూచించారు. సోమవారం దాసరహళ్లి నియోజకవర్గంలోని మల్లసంద్ర, దాసరహళ్లి ప్రాంతాల్లో ఇళ్లలో చెత్త సేకరణ విధానాన్ని ఆయన బెంగళూరు ఉత్తర నగర పాలికె కమిషనర్ సునీల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాన్ని గమనించి చెత్త వేస్తున్న ప్రజలను చెత్త విభజించారా? ఆయన ప్రశ్నించారు. పొడి చెత్త, పచ్చి చెత్త కలిపి వస్తే తర్వాత విభజన కష్టమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మిశ్రమ చెత్తను తీసుకోవద్దని సూచించారు. అనంతరం ఆయన పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నుంచి విభజించిన చెత్త మాత్రమే స్వీకరించాలని తద్వారా పచ్చి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చుతామని, పొడిచెత్తను సిమెంట్ కంపెనీలు, విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలకు పంపించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

రోడ్డుపై చెత్త వేస్తే కఠిన చర్యలు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులు, పాదచారి మార్గాలపై ఎవరైనా మట్టి, చెత్త వేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జరిమానా వసూలు చేస్తామని అధికారులు హెచ్చరించారు. నగర మధ్య భాగంలో శుభ్రత పనుల్లో వేగం పెంచినట్లు వెల్లడించారు. వాహన సంచారం, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న మట్టి కుప్పలను తొలగించే పనులను జీబీఏ అధికారులు చేపట్టారు. చామరాజపేట, కె.ఆర్.మార్కెట్,కలాసీపాళ్య, కాటన్‌పేట, చిక్కపేట తదితర ప్రాంతాల్లో మట్టి కుప్పలను జేసీబీ యంత్రాలు, కార్మికులతో తొలగించారు. ప్రధానంగా చామరాజపేట పరిధిలోని మెట్రో ఉపరితల మార్గం కింద ఉన్న రహదారుల్లో ఉన్నమట్టి కుప్పలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. పది ట్రాక్టర్ల మట్టిని బయటకు పంపించారు. చెత్త నుంచి స్వాతంత్ర్యం అభియాన్‌లో భాగంగా ఆయా ప్రదేశాల్లో ఉన్న మట్టి దిబ్బలు, చెత్త కుప్పలు, కట్టడాల వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించడం ప్రారంభించారు. తొలగించిన ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఉంచారు. రాత్రి వేళల్లో మట్టి, చెత్త వేయకుండా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు.

చెత్త తొలగిస్తున్న కార్మికులు

పనులను తనిఖీ చేస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

బాధ్యతా రాహిత్యమే ప్రధాన సమస్య

బెంగళూరు (యలహంక): నిధులు కొరత కన్నా జీబీఏ అధికారుల బాధ్యతా రాహిత్యమే ప్రధాన సమస్యగా ఉందని బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వీధిదీపాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా ఉందని తెలిపారు. వాటి నిర్వహణలో విఫలమయ్యారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బెంగళూరు కేంద్ర నగరపాలికె కమిషనర్‌కు సూచించారు. ఇటీవల ఓరాత్రి తాను హడ్సన్ కూడలి నుంచి పాత మైసూరు బ్యాంకు కూడలి వరకు.. అక్కడి నుంచి చాలుక్య కూడలి వరకు రహదారిని పరిశీలిస్తే 222 వీధి దీపాలు ఉండగా వాటిల్లో 142 వెలగలేదన్నారు. ఆ రహదారి నగరం మధ్యలో ఉందని, ఇక శివార్ల రహదారుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పాల సేకరణ కేంద్రం ప్రారంభం

పావగడ, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కడమలకుంట గ్రామంలో మహిళా సహకార సంఘ నూతన పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు ఉచిత కుట్టు మిషన్లను, గిరిరాజు కోడి పిల్లలను వితరణ చేపట్టారు. తాలూకా పంచాయతీ కార్యాలయలో కరవు నిర్వహణ, వీబీజీ రామ్‌జీ విస్తరణ, భారత్ జోడో యువసేన వంటి వివిధ విషయాలను చర్చించారు. తన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహశీల్దారు వై.రవి, ఈఓ మధుసూదన్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా రాఘవుడి రథోత్సవం

బెంగళూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జయనగర నంజనగూడు శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం శ్రీగురురాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల ఉత్తరారాధన వేడుకలను ఘనంగా ఆచరించారు. ఆరాధన ఉత్సవాల 3 రోజున నిర్వహించిన ఈ ఉత్తరారాధన కార్యక్రమంగా జయనగర రాజవీధుల్లో మహారథోత్సవం వేడుకలను ఘనంగా జరిపారు. ఈ మహారథోత్సవాన్ని ప్రముఖులు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సీకే రామమూర్తి పూజలు చేసి ప్రారంభించారు. జయనగర ఐదో బ్లాక్ ప్రముఖ వీధుల్లో ఈ రథోత్సవంలో కేరళం చండే వాదన, ఉడుపి బొమ్మలు, రామనగర డొళ్లుకుణిత తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంలో మహిళా మండలి సభ్యులు భక్తితో దాసవరేణ్యుల గీతాలను ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ తమ భక్తిని చాటుకున్నారు. చిన్నపిల్లల నుంచి వయోవృద్ధులు ఈ ఉత్సవంలో పాల్గొని రాఘవేంద్రస్వామి అనుగ్రహానికి పాత్రులైయ్యారని ఆలయం వ్యవస్థాపకుడు ఆర్.కె. వాదీంద్రాచార్యులు తెలిపారు.

మఠంలో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి తదితరులు

అక్టోబరు 1 నుంచి కేకేపీఎల్ కబడ్డీ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక ప్రీమియర్ లీగ్ (కేకేపీఎల్) కబడ్డీ పోటీలను అక్టోబరు ఒకటి నుంచి ఎనిమిది వరకు కోరమంగల ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్రోమవారం ఒక ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 5 ఎన్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సుదేశ్‌బండారీ, డైరెక్టర్ శేఖర్‌మూర్తి, లీగ్ కమిషనర్ అజ్‌ఫర్ రజాక్, దీపక్‌పిల్లార్, కర్ణాటక అమెచ్యూర్ కబడ్డీ సంఘం అధ్యక్షుడు, కోశాధికారి నారాయణస్వామి మాట్లాడారు. ఇప్పటికే క్రీడాకారులు వేలం ప్రక్రియ ముగిసింది. ఎనిమిది ప్రాంఛైసీలు కర్ణాటకలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను కొనుగోలు చేశాయి. పోటీల్లో బెంగళూరు బైసన్స్, మంగళూరు ఇండియన్స్, మైసూరు మహాసేనె, బెళగావి బుల్స్, హోయ్సళ ఎంపైర్ హాసన, చాళుక్యసేనా బాగలకోటె, ఉత్తర కన్నడ స్టాలియన్స్, విజయపుర లయన్స్ జట్లు పాల్గొంటాయి.

లాంఛనాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : జాలహళ్లిలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ సోమవారం అధికారులతో కలసి పర్యటించారు. వీధుల్లో చెత్త ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీటి కాల్వల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. తక్షణమే శుభ్రం చేయాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు కిరణ్ (కిట్టి), నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : కెలమంగలం శివారు అఖసోణ గ్రామానికి చెందిన రైతు గోపాల్‌ను గత నెల 26న దుండుగులు కారులో కిడ్నాప్ చేశారు. అతని భార్య ఇంద్ర ఫిర్యాదు మేరకు డెంకణీకోట డీఎస్పీ ఆనందరాజు నేతృత్వంలో దర్యాప్తు చేశారు. నిందితులు చెన్నైలో ఉన్నట్లు గుర్తించి అక్కడికెళ్లి పట్టుకున్నారు. ఈ కేసులో ఆనంద్ (52), సయ్యద్ అబ్దుల్ ఖాదర్, (44), జయపాల్ (54), పాండియన్ కుమారేశన్ (47), రాజు (42), నాగరాజు (43)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రియాసుదీప్, సంచిత్‌తో ఆటోలు అందుకున్న వారు

మానవత్వం చాటిన నటుడు కిచ్చా సుదీప్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : సినీనటుడు కిచ్చా సుదీప్ వెండితెరపైనే కాక నిజజీవితంలో సామాజిక సేవ చేస్తూ ప్రశంసలందుకుంటున్నారు. తల్లి సరోజా సంజీవ్ జ్ఞాపకార్థం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాలుగు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆ కుటుంబాల జీవనోపాధికి సుదీప్ భార్య ప్రియా సుదీప్, అన్న కుమారుడు సంచిత్ ద్వారా ఆటోలు పంపిణీ చేయించారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లల బాధ్యతలు మోయలేక ఇబ్బందిపడుతున్న పవిత్ర, హుబ్బళ్లికి చెందిన మృత్యుంజయ, ఫైటర్ బసవరాజు, సుదీప్ తల్లికి ఆప్తులు సాయిమధు గత ఏడాది బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందగా..అతని తండ్రికి సైతం ఆటోను సమకూర్చారు.

8న చిత్రదుర్గ బంద్

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం గుట్కా నిషేధాన్ని రద్దు చేయాలని, చిత్రదుర్గ, హొళల్కెర, మొలకాల్మూరులను కరువు పీడిత తాలూకాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న చిత్రదుర్గ బంద్ నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ధనంజయ తెలిపారు. సోమవారం రైతు సంఘం ప్రతినిధులు సమావేశమై బంద్ చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. గుట్కా నిషేధంతో జిల్లాలోని వేల మంది వక్క తోటల పెంపకం రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

నేడు దావణగెరె ...: గుట్కా నిషేధాన్ని రద్దు చేయాలని, భద్రా జలాశయం నుంచి ఎగువ భద్రాకు 3 టీఎంసీల నీటిని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం దావణగెర బంద్‌కు పిలుపు ఇచ్చారు. బంద్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి బైక్ ర్యాలీ చేపట్టారు.

రైతు సంఘం సమావేశంలో ప్రతినిధులు

చిన్నారుల సైకిల్ సవారీ భళా

మాన్యత పార్క్‌లో 'భూమి కోసం ఎంబెస్సీ సైక్లింగ్' పేరిట ఆదివారం నిర్వహించిన సైక్లోథాన్ కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. సైక్లోథాన్‌లలో 1700కి పైగా చిన్నారులు, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబెస్సీ ఆర్‌ఈఐటీ ముఖ్య కార్యానిర్వహణాధికారి అమిత్‌శెట్టి మాట్లాడుతూ పదకొండో ఏట నిర్వహిస్తున్న సైక్లోథాన్‌కు ప్రోత్సాహకులు పెరుగుతున్నారన్నారు. సైకిల్ తొక్కడంతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. **- న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)**

క్రైం కార్నర్

ముగ్గురు ఎస్సైల సస్పెన్షన్

కార్వార, న్యూస్‌టుడే : ఠాణాలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అవినీతిని పాల్పడుతున్నట్లు ఆరోపణలపై హళియాళ విభాగం ఎస్సైలు కిరణ్ పాటిల్, వినోద్‌రెడ్డి, నేర విభాగం ఎస్సై కృష్ణలను ఎస్పీ ఎంఎన్ దీపన్ సస్పెండ్ చేశారు. పై అధికారులకు మాముళ్లు ఇస్తున్నామంటూ మాట్లాడుకున్న ఆడియో బయటకు వచ్చి, వైరల్‌గా మారడంతో ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

హంతకుల అరెస్టు

బెళగావి, న్యూస్‌టుడే : నిప్పాణి గ్రామీణ ఠాణా పరిధిలో ఆగస్టు 26న మహ్మద్ శంషేర్ ఖలీఫ్ (52)ను హత్య చేసి పరారైన ఇద్దరు హంతకులను మహారాష్ట్రలో బంధించామని ఎస్పీ రామరాజ్ తెలిపారు. యువరాజ్ విరూపాక్షప్ప మున్నోళి (22), స్వప్నిల్ శివానంద రామపుర (21)లను నిందితులుగా గుర్తించారు. మహారాష్ట్రలోని పుణెలో హంతకులు తలదాచుకున్నట్లు గుర్తించి, పోలీసులు అక్కడకు వెళ్లి, వారిని అరెస్టు చేసి తీసుకొచ్చారు.

ప్రమాదంలో వృద్ధుడి మృతి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : యశ్వంతపుర ట్రాఫిక్ ఠాణా పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కావల్ భైరసంద్రకు చెందిన ఆర్‌ప బాబు (68) అనే వృద్ధుడు మరణించాడు. బైకుపై వెళుతున్న ఆయనను జీబీఏ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించారు. పోలీసులు డ్రైవరును అరెస్టు చేసి లారీని జప్తు చేసుకున్నారు.

నిమ్మకాయల వ్యాపారి..

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : పీణ్యా ఉపరితల వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేశ్ (38) అనే నిమ్మకాయల వ్యాపారి మరణించారు. గురగుంటపాళ్యకు చెందిన ఆయన మార్కెట్‌కు వెళుతూ ముందున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి కింద పడి గాయపడ్డారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు.

బెదిరిన్నారని దర్శకుడి ఫిర్యాదు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : తీసుకున్న రుణాన్ని చెల్లిస్తామని చెప్పినా..భాస్కరశెట్టి, వాసుదేవ రెడ్డి అనే వ్యక్తులు తనను, తన భార్య డెన్నిసాను బెదిరిస్తున్నారని నటుడు, దర్శకుడు ఓంప్రకాశ్‌రావు ఆరోపించారు. ఫినిక్స్ సినిమా కోసం చేసిన అప్పు విషయంలో వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని రాజరాజేశ్వరి నగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. తమ ఇంటి వద్దకు అపరిచితులు వచ్చి బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : గుడిబండె పట్టణం బాపూజీనగరకు చెందిన మహేశ్ (28) అనే యువకుడు అనుమానాస్పదంగా మరణించాడు. నెలకదిరేనహళ్లికి చెందిన అతను ఉరి వేసుకుని మరణించాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మరణోత్తర పరీక్షలు నిర్వహించిన వైద్యులకు అతని కడుపులో లైటర్, బ్యాటరీ, తాళం చెవులు, ఔషధం ట్యూబు, ఇనుప ముక్కలు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. నొప్పి తాళలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని గుడిబండె ఠాణా పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : మాగడి రోడ్డు అగ్నిమాపకదళ ఠాణా వద్ద బైకుపై వెళుతున్న రవి (34) అనే వ్యక్తికి ఛాతీలో నొప్పి వచ్చింది. గస్తీ తిరుగుతున్న హొయ్సళ-88 సిబ్బంది గుర్తించారు. తక్షణమే సీపీఆర్ చేసి అతన్ని రక్షించారు. అనంతరం ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్చారు. సీపీఆర్‌తో రవికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. అతని ప్రాణాలను కాపాడిన ఏఎస్సై సచ్చిదానందమూర్తి, కానిస్టేబుల్ బసవరాజను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

బాంబు పేలుడు కేసులో నలుగురి అరెస్టు

పావగడ, న్యూస్‌టుడే: తాలూకాలోని కనికలబండ గ్రామంలో గిరియప్ప అనే రైతు పొలంలో శుక్రవారం మోటార్ స్టార్టర్ వద్ద నాటు బాంబు పేలుడు కేసులో 8 మందిపై కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. గిరియప్ప ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు గిరియప్ప కుటుంబ సభ్యులను దూషిస్తున్న వెంకటేశ్ భార్య సావిత్రమ్మ, కూతురు స్వాతి, బంధువులు రామాంజినప్ప, మారుతిలను ఆదివారం అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరచి మధుగిరి జైలుకు తరలించినట్లు సీఐ కె.సురేశ్ తెలిపారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ఆధునిక సమాజంలో మూఢనమ్మకాలు నానాటికీ పెరుగుతున్నాయని, నేటి యువత వాటికి దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి మిస్పా మినిస్టరిస్ వ్యవస్థాపకుడు కృపాకర్‌పాల్ పిలుపునిచ్చారు. నగరంలోని రామచంద్రపుర తెలుగు బాప్టిస్ట్‌చర్చి (టీబీసీ)లో తెలుగు క్రైస్తవ కృతజ్ఞత పండగ సువార్త సమావేశాలు ముగిశాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని, వాటి నుంచి బయటపడాలని నిరంతరం బోధనలు చేశారని గుర్తు చేశారు. క్రైస్తవులు మూఢనమ్మకాల్లో కూరుకుపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కృతజ్ఞత పండగ సువార్త సమావేశాలు విజయవంతమైనట్లు పాస్టర్ రెవరెండ్ ఎంబీ మోసెస్ తెలిపారు.

కృపాకర్‌పాల్‌ను సత్కరిస్తున్న మోసెస్, తదితరులు

హక్కుల సాధనకు ఉద్యమాలు

బెంగళూరు (యశ్వంతపుర), : సమాజంలో పీడిత వర్గాలు తమ హక్కుల సాధన కోసం రాజ్యాంగ పరిధిలో ఉద్యమించాలని కర్ణాటక మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్టభద్రుల సంఘం సమావేశ మందిరంలో నిర్వహించిన మహాసభ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను చైతన్యవంతుల్ని చేసేందుకు సెప్టెంబరు ఆఖరి ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తమ హక్కులపై అవగాహన పెంచుకుని వాటిని సాధించేందుకు పోరాటాలు చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు దాసరి శ్యామసుందర్, కార్యదర్శి నవీన్, కోశాధికారి మాల్యాద్రి, పదాధికారులు మల్లికార్జున, నరసింహులు, రామస్వామి, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

మేమూ వేచి చూస్తున్నాం

మైసూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా, తన వద్ద ఉన్న దాఖాలాలను విడుదల చేస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను తాను విన్నానని, ఆయన ఏం చేస్తారో వేచి చూస్తున్నామని మంత్రి హెచ్‌సీ బాలకృష్ణ వ్యాఖ్యానించారు. మైసూరులో తనను కలుసుకున్న విలేకరులతో మంత్రి మాట్లాడుతూ విపక్షాలకు చెందిన నాయకులు నిర్మాణాత్మక పాత్రను పోషించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. నాగేంద్రపై ఆరోపణలు వచ్చినా, ఆయన నేరగాడని ఇంకా రుజువు కాకుండానే మంత్రి పదవికి రాజీనామా చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఇబ్బంది కలుగకుండా నాగేంద్ర స్వయంగా రాజీనామా చేశారని తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కర్ణాటక పాత్రికేయుల సహకార సంఘంలోని సభ్యుల కుటుంబాల్లోని విద్యార్థులకు ఎమ్మెల్సీ కె.శివకుమార్ ప్రతిభా పురస్కారలను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సలహాదారుడు కేవీ ప్రభాకర్, ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్, కేంద్ర మంత్రి కుమారస్వామి సలహాదారుడు పీకే చెన్నకృష్ణ, సంఘం అధ్యక్షుడు రమేశ్ పాళ్య, సంఘం ప్రతినిధులు రమేశ్ హిరేజంబూరు, బీఎన్ మోహన్, సర్వశ్రీ, కేవీ పరమేశ్, ధ్యాన్ పుణచ్చ, వనిత, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎమ్మెల్సీ, పాత్రికేయులు

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

దేవస్థానానికి చేరిన కొత్త రథం

రథానికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే: నీరమాన్వి గ్రామంలోని దొడ్డ ఊరు ఆంజనేయస్వామి దేవస్థానానికి నూతనంగా రథం సమకూరింది. నిధులను గ్రామానికి చెందిన భక్తులు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సమకూర్చారు. ఈ రథాన్ని భక్తులు నీరమాన్వి గ్రామానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, ప్రముఖులు లక్ష్మీదేవి నాయక్, గఫూర్, చన్నప్పగౌడ, గోవిందనాయక్, శ్రీరాములు, శివప్ప, దుర్గణ్ణ, బసవరాజ్, భీమణ్ణ, వెంకటేశ్, నాగరాజ్ యాదవ్, కృష్ణ, మరిస్వామి, గంగణ్ణ, జగదీశ్, తోటప్ప పాల్గొన్నారు.

కనులపండువగా గురురాఘవేంద్రుల రథోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే: స్థానిక రాఘవేంద్రస్వామి మఠంలో గురు రాఘవేంద్రస్వామివారి ఆరాధన మహోత్సవ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 3 రోజుల పాటు నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాల్లో బ్రాహ్మణ, ఆర్యవైశ్య సముదాయాల ఆధ్వర్యంలో మఠంలో వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు బృందావన దర్శనం చేసుకున్నారు. రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్పనాయక్ కుటుంబసభ్యులతో కలిసి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రథోత్సవం వద్ద భక్తులు

భూమానంద కుటుంబానికి మంత్రి పరామర్శ

రాయచూరు, న్యూస్‌టుడే: దేవదుర్గ తాలూకా హర్తినాళలో భూమానంద కుటుంబాన్ని జిల్లా బాధ్య మంత్రి అజయ్‌సింగ్ సోమవారం పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ.. కేసును ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని చెబుతూ నిందితులను వదలబోమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రికి వివరించినట్లు తెలిపారు. హత్యల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న, పరోక్షంగా ప్రమేయం ఉన్న, ప్రోత్సహించిన వారిని గుర్తించేందుకు పారదర్శకంగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు చెప్పారు. అన్నివిధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబానికి మంత్రి హామీ ఇచ్చారు. దేవదుర్గ శాసనసభ్యురాలు కరెమ్మనాయక్ మాట్లాడుతూ..నిందితులు ఏ స్థాయి వారైన చట్టం ప్రకారం త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అజయ్‌కు విజ్ఞప్తి చేశారు. దేవదుర్గ తాలూకా సామాజిక సంక్షేమ శాఖ అధికారి రాజకుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వం విడుదల చేసిన రూ.8,25,000 పరిహారంలో తొలి విడతలో రూ.4,12,500లను బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు వెల్లడించారు. ఎంపీ కుమార నాయక్, మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, మాజీ మంత్రి బోసురాజు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబంతో మంత్రి, ప్రజా ప్రతినిధులు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

మాన్వి, న్యూస్‌టుడే: జిల్లాలో జరిగిన దళితుల హత్యలకు సంబంధించిన సంఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, మృతుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటుందని జిల్లా బాధ్యమంత్రి అజయ్‌సింగ్ తెలిపారు. ఆయన మాజీ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, లోక్‌సభ సభ్యుడు జి.కుమార నాయక్, ఎమ్మెల్యేలు హంపయ్యనాయక్, జి.కరెమ్మ, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సిరివార తాలూకా హొక్రాణి, దేవదుర్గ తాలూకా హర్తినాళ, లింగసుగూరు తాలూకా కరడకల్ గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ..ఇలాంటి దారుణ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరంగా, ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలకు సహాయ, సహకారాలు అందించనున్నట్లు వెల్లడించారు. న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. హొక్రాణి గ్రామంలో అశ్విని కుటుంబానికి మంత్రి అజయ్‌సింగ్ వ్యక్తిగతంగా ధన సాయం చేశారు. కాంగ్రెస్ ప్రముఖులు రామణ్ణ ఇరబగేరా, శ్రీదేవినాయక్, జయణ్ణ, శివమూర్తి, కె.శాంతప్ప, బాలస్వామి కొడ్లి, జయంతరావు పతంగె, గఫూర్‌సాబ్, అమరేశప్ప, ఎస్పీ, జిల్లా, తాలూకాల సాంఘిక సంక్షేమ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న ప్రముఖులు

ఉద్యాననగరిలో విదేశీ పక్షుల కువకువలు!


రాజధాని శివార్లలో అగర చెరువుకు జలకళ

ఆహారం వేట షురూ..

ఆకట్టుకునే విదేశీ పక్షి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో వందెకరాల విస్తీర్ణంలో ఉన్న అగర చెరువు వద్దకు వివిధ జాతుల దేశ, విదేశీ పక్షుల రాక మొదలైంది. చెరువులో నీరు ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని, పక్షుల రాకతో చెరువుకు నిండుతనం వచ్చిందని పరిసరవాదులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు మూడు నెలలు పక్షులు ఇక్కడే ఉండి మళ్లీ తమ ప్రాంతాలకు వెళ్లిపోతాయి. పక్షుల కోసం చెరువు మధ్యలో ఐల్యాండ్ ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ దట్టమైన వృక్షాలు ఉన్నాయి. చెరువులో చేపలు ఇతర పురుగులు ఉండటంతో పక్షులకు ఆహార కొరత ఉండదు. కొంగలతో పాటు వివిధ జాతుల పక్షులు ఏటా వస్తుంటాయి. కేరళ, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు శ్రీలంక, మలేషియా, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి పక్షులు వస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అగర చెరువు సంరక్షణ సమితి సభ్యులు నిరంతరం చెరువు నీరు పరిశుభ్రత, చుట్టు పక్కల స్వచ్ఛత కోసం శ్రమిస్తున్నారు. ఇక్కడ పక్షులు కొంత కాలం ఉండేందుకు అనుగుణంగా చెట్లపై కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేశారు. పక్షులను తమ కెమెరాల్లో బంధించేందుకు పరిసర ప్రేమికులు సెలవు రోజుల్లో చెరువు వద్ద మకాం వేస్తారు. ప్రభుత్వం చెరువును బాగా అభివృద్ధి చేసింది. చుట్టూ నడకదారి, ఉద్యానవనాలు, బయలు వ్యాయామశాలలను ఏర్పాటు చేశారు. మురికినీరు నేరుగా చెరువులోకి రాకుండా శుద్ధీకరణ చర్యలు చేపట్టారు.

చెరువు వద్ద కొంగలు

తెల్లకొంగ భలే..

యోగా ఆరోగ్యానికి రక్ష

మాట్లాడుతున్న శిక్షకుడు స్వామి

రాయచూరు, న్యూస్‌టుడే: జీవన శైలి, ఆహార పద్ధతులు మారిన నేపథ్యంలో ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ శిక్షకుడు మల్లికార్జున స్వామి సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో 10 రోజుల యోగా శిబిరం సోమవారం మొదలైంది. ఇందులో పాల్గొన్న స్వామి ఉపన్యసిస్తూ ఏకాగ్రత, ప్రశాంతతకు, సానుకూలంగా స్పందించే తత్వం యోగా వల్ల సాధ్యపడుతుందని వివరించారు. ప్రిన్సిపల్ సుగుణా మాట్లాడుతూ..యాంత్రిక జీవనం, విధుల ఒతిళ్ల మధ్య నలిగిపోతున్న వారికి ఉపశమనం కల్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సంయోజకురాలు జ్యోతి, సహ సంచాలకుడు శరణేగౌడ పాల్గొన్నారు.

3 రోజుల్లో సర్కారుకు నివేదిక

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లాలో జరిగిన దళితుల హత్యలకు సంబంధించి రూపొందించిన సమగ్ర నివేదికను 3 రోజుల్లో ప్రభుత్వానికి అందిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు ఎల్.మూర్తి వెల్లడించారు. నిందితులకు కఠిన శిక్ష పడాలని, బాధితుల కుటుంబాలను త్వరగా ఆదుకోవాలని హోం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులకు సిఫార్సు చేస్తానని చెప్పారు. జిల్లా పంచాయతీ సభాభవనంలో సోమవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో మూర్తి పాల్గొని సమస్యలను ఆలకించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ. .అభియోగ పత్రం (ఛార్జ్‌షీట్) మోపడంలో జాప్యం చేయవద్దని, సాక్ష్యాలను తారుమారు చేయకుండా నిఘా వహించాలని పోలీస్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఇక నుంచి హత్య జరిగిన ప్రాంతానికి స్వయాన వెళ్లాలని, దళితులు, గిరిజనుల జనాభ స్వల్పంగా ఉండే సున్నిత కాలనీల్లో పెట్రోలింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని ఎస్పీ అరుణాంగ్షు గిరికి సూచించినట్లు వెల్లడించారు. దౌర్జన్యాల కేసుల్లో వేగంగా చర్యలు తీసుకునేందుకు ఒక సమితిని నియమించాలని కోరినట్లు చెప్పారు. వసతి నిలయాల్లో మౌలిక వసతులను గుర్తించేందుకు సమితిని రచించాలని, ఎస్‌సీఎస్‌పీ, టీఎస్పీ నిధుల దుర్వినియోగంపై అందే ఫిర్యాదులను గంభీరంగా పరిగణించాలని జిల్లా పాలనాధికారిణి పూవితాకు సలహా ఇచ్చానన్నారు. 3 మాసాలకొకసారి ఎస్సీ, ఎస్టీ సంఘాలతో సమావేశం కావాలని కోరినట్లు పేర్కొన్నారు. కల్తీ కల్లు, మద్యం అనధీకృత విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశించినట్లు మూర్తి వెల్లడించారు. కమిషన్ కార్యదర్శి హెచ్.ఎస్.శివరాము, సభ్యులు సునీల్ ఎం. ఉక్కలి, ఎన్.దివాకర్, గీతా ధాంవశి, జడ్పీ సీఈవో ఈశ్వరకుమార్ హాజరయ్యారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మూర్తి

సైబర్ నేరగాళ్ల విశ్వరూపం

ఏడునెలల్లో రూ.558 కోట్లు హాంఫట్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కర్ణాటకలో నానాటికీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. గత ఏడు నెలల్లో ప్రజల నుంచి రూ.558 కోట్లను ఈ నేరగాళ్లు కొట్టివేశారు. ఫిర్యాదుల అనంతరం బాధితులకు చేరింది రూ.1.9 కోట్లు మాత్రమే. వంచన జరిగిన వెంటనే ఫిర్యాదులు చేయడంతో రూ.35.9 కోట్ల నగదును ఫ్రీజ్ చేయగలిగినా, దాన్ని బాధితుల ఖాతాలకు మళ్లించడంలో జాప్యం జరుగుతోంది. భారతదేశానికి సిలికాన్ వ్యాలీగా బెంగళూరుకు గుర్తింపు ఉన్నప్పటికీ పోలీసుల వద్ద సైబర్ నిపుణుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఈ కేసుల దర్యాప్తు మందగతిన నడుస్తోంది. బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌లోని సైబర్ ఠాణాలో 200 పోస్టులతో కలిపి నగర వ్యాప్తంగా 320 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 2024లో 17,890 కేసులు నమోదు కాగా, రూ.1841 కోట్లను ప్రజలు పోగొట్టుకున్నారు. అందులో రూ.183.6 కోట్లను మాత్రమే బాధితులకు తిరిగి అందించగలిగారు. గత ఏడాది 10,703 కేసులు నమోదు కాగా, రూ.1,756.6 కోట్లను ప్రజలు పోగొట్టుకోగా, రూ.158.5 కోట్లను మాత్రమే రికవర్ చేసి బాధితులకు అందించగలిగారు. ఈ ఏడాది నమోదైన కేసులు తక్కువగానే ఉన్నాయి. ప్రజల్లో జాగృతి రావడమే ఇందుకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వలేదని..

అన్నను చంపిన తమ్ముడు

మంగళూరు, న్యూస్‌టుడే : సెల్‌ఫోన్ విషయంలో జరిగిన గొడవలో అడివెప్ప (40) అనే వ్యక్తిని అతని తమ్ముడు రాజు (36) కిరాతకంగా కడతేర్చాడు. బెళగావి జిల్లా బైలహొంగలకు చెందిన వీరి కుటుంబ సభ్యులు కూలి పనులు చేసుకునేందుకు కొట్టూరు క్రాస్‌కు వచ్చి బాడుగ ఇంట్లో ఉంటున్నారు. వీరి తల్లి కిరాణా కొట్టు నిర్వహించేది. ఆదివారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి ఇంటికి వచ్చారు. సెల్‌ఫోన్ కోసం ఇద్దరూ గొడవపడ్డారు. ఆగ్రహించిన తమ్ముడు పక్కనే ఉన్న కత్తిని అందుకుని అన్నను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం వెన్‌లాక్ ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. మంగళూరు ఊర్వ ఠాణా పోలీసులు హంతకుడ్ని అరెస్టు చేసినట్లు కమిషనర్ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మండ్య జైలర్ బదిలీ

మండ్య, న్యూస్‌టుడే : ఖైదీలకు కారాగారంలో సదుపాయాలు కల్పించేందుకు వారి కుటుంబ సభ్యుల నుంచి నగదు తీసుకుంటున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మండ్య జిల్లా కారాగారం జైలర్ శాంతమ్మను బళ్లారి కారాగారానికి బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారి అలోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మండ్య జిల్లా ఆసుపత్రిలో ఒక ఖైదీకి రాజాతిథ్యం ఇవ్వడంతో పాటు, అతని ప్రియురాలిని కూడా ఆ గదిలోకి అనుమతించినట్లు లోకాయుక్త అధికారులు గుర్తించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని కారాగార శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో కారాగారం అధికారుల వైఫల్యం ఉన్నట్లు గుర్తించి, ఆమెను బళ్లారి కారాగారానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బాధితులకు న్యాయం జరిగేదాకా ఆందోళన

విలేకరులతో మాట్లాడుతున్న అంబాజీరావు

రాయచూరు, న్యూస్‌టుడే: దర్వేశ్ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన పెట్టుబడిదారులకు న్యాయం చేయాలని కోరుతూ టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో మంగళవారం నుంచి నిరవధిక ఆందోళన ఆరంభిస్తున్నామని బాధితుల హితాసక్తి వేదిక సంచాలకుడు అంబాజీరావు మదనకర్ వెల్లడించారు. ఉదయం 10 గంటలకు చంద్రమౌళేశ్వర కూడలి వద్ద పాదయాత్రను మొదలుపెట్టి, మహావీర కూడలి, తీన్‌కందిల్, నగర పాలక సంస్థ కార్యాలయం మీదుగా ఉద్యానవనానికి చేరుకుంటామని వివరించారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో విలేకర్ల గోష్ఠిలో మాట్లాడారు. మోసపోయి రెండున్నర ఏళ్లు గడిచినా డబ్బు ఇవ్వనందున అనేక కుటుంబాల జీవన పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. దర్యాప్తు సంస్థ కేసును త్వరగా ముగించి బాధితులను ఆదుకోవాలని, న్యాయ పరిధిలోని కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తెస్తామని తెలిపారు. సభ్యులు మెహరున్నీసా బేగం, మసూద్ ఆలీ, సయ్యద్ హుస్సేన్, సుల్తాన్, బాషా జాఫర్ ఉన్నారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాత్రికేయుల సమావేశంలో శ్యామదాస్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే: శ్రీ కృష్ణ జన్మాష్టమిని సెప్టెంబరు 4న ఘనంగా, వైభవంగా నిర్వహిస్తామని రాయచూరు ఇస్కాన్ కేంద్రం మేనేజర్ సారథి శ్యామదాస్ వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. ఉదయం రాధా కృష్ణుల విగ్రహాలకు పవిత్ర ద్రవాలు, పండ్ల రసాలతో అభిషేకం, పుష్పాలతో అర్చన చేస్తామని వివరించారు. హరినామ సంకీర్తనలను విన్పిస్తామని, భగవద్గీత సామూహిక పఠనం, భజనలు జరుగుతాయని తెలిపారు. అర్ధరాత్రి కృష్ణుడిని కీర్తనలు, శంకు చక్రాలతో ఆహ్వానిస్తామని, మహా మంగళ హారతి ఉంటుందని చెప్పారు. దర్శనం కోసం విచ్చేసే భక్తులు ఇబ్బందులు పడకుండా క్యూలైన్లను ఏర్పాటు చేస్తామని, ప్రసాద వ్యవస్థ రోజంతా కొనసాగుతుందని వివరించారు. కృష్ణాష్టమి వేడుకలకు ప్రజలు తరలిరావాలని శ్యామదాస్ కోరారు. కార్యక్రమంలో కృష్ణ భక్తులు అభిషేక్, శ్రీనివాస్, పరనందిని, శశిముఖి పాల్గొన్నారు.

రవికాంతేగౌడ పదవీవిరమణ

దావణగెరె, న్యూస్‌టుడే : కర్ణాటక తూర్పు వలయం ఐజీపీ డాక్టర్ బీఆర్ రవికాంతే గౌడ సోమవారం పదవీ విరమణ చేశారు. మండ్య జిల్లాకు చెందిన ఆయన 1997లో పోలీసు సేవల్లో చేరారు. కర్ణాటక పోలీసు అకాడమిలో శిక్ష పూర్తి చేసుకుని బెంగళూరు గ్రామీణ జిల్లాలో డీవైఎస్పీగా విధులు నిర్వహించారు. హుబ్బళ్లి-ధార్వాడ, మైసూరు, దక్షిణ కన్నడ, బెళగావిలలో సేవలు అందించారు. బెంగళూరు ట్రాఫిక్ విభాగం జాయింటు కమిషనర్‌గా సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి, రాష్ట్రపతి పతకాలను అందుకున్నారు. దావణగెరె జిల్లా పోలీసు కవాతు మైదానంలో సోమవారం సిబ్బంది నుంచి గౌరవ వందనం అందుకుని, పదవీ విరమణ చేశారు.

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయండి

నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే: కేంద్రం పరిధిలోని 8.73 లక్షల, రాష్ట్ర స్థాయిలోని 2.84 లక్షల ఖాళీలను భర్తీ చేయాలని ఏఐడీవైఓ జిల్లాధ్యక్షుడు చెన్నబసవ డిమాండ్ చేశారు. రాయచూరు తాలూకా మన్సలాపూరులో సోమవారం యువ సంబంధ అభియాన్‌ను నిర్వహించారు. జిల్లాధ్యక్షుడు మాట్లాడుతూ..లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయనందున నిరుద్యోగుల్లో పెరుగుతున్న అసహనాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. 100 మంది పట్టభద్రుల్లో 40 మందికి ఎటువంటి ఉద్యోగం దొరకడం లేదు. దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అరకొర ఖాళీల నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలని, పరిమిత పరీక్ష ఫీజును ఖరారు చేయాలని, పరీక్ష రోజు ఉచిత ప్రయాణాన్ని కల్పించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని ఒత్తిడి తెచ్చారు. విద్యార్థుల కోసం సెలవు రోజుల్లో గ్రంథాలయాలను తెరిపించాలని కోరారు.

భాజపాకు హనుమాన్‌గౌడ బెళగుర్కి గుడ్‌బై

పార్టీకి రాజీనామా ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న హనుమాన్ గౌడ (ఆకుపచ్చ తువాలు)

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు సీనియర్ రాజకీయ నాయకుడు, కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ ధరల కమిషన్ మాజీ అధ్యక్షుడు హనుమాన్ గౌడ బెళగుర్కి భారతీయ జనతాపార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా సమర్పించినట్లు సోమవారం విలేకరులకు వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడికి మెయిల్‌లో పంపిన రాజీనామా పత్రాన్ని చూపించారు. రాజీనామాకు గల కారణాలు వెల్లడించలేదు. తదుపరి ఏ పార్టీలో చేరేది స్పష్టం చేయలేదు. సమయం వచ్చినపుడు ఏ పార్టీలో చేరేది తెల్పుతానని అన్నారు. భాజపా హయాంలో నన్ను కేపీసీ అధ్యక్షుడ్ని చేసి అప్పటి ప్రభుత్వంలో తనకు కేబినెట్ మంత్రి హోదా గల అధికారాన్ని ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను ఆయన అభినందించారు. నేను భాజపాలో చేరిన 15 రోజుల వ్యవధిలో యడియూరప్ప నన్ను ధరల కమిషన్ అధ్యక్షుడ్ని చేయడం సంతోషం కలిగించిన అంశమని అన్నారు. అధ్యక్షుడిగా నా హయాంలో పది వరకు అప్పటి ప్రభుత్వానికి నివేదికలు అందివ్వగా అందులో చాలా శాతం అమలయ్యాయని వివరించారు. జొన్న, రాగి ఉత్పత్తులకు నేడు చక్కని ధర పలుకుతుందంటే అది నాటి కమిషన్ నివేదిక ఫలితం అన్నారు. నేను ఒకే ఒక్కసారి సింధనూరు అసెంబ్లీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోడానికి పోటీ చేశాను. మరోసారి ప్రయత్నం చేసుంటే ఎమ్మెల్యేని అయ్యుండేవాడినని అనుచరులు చెబుతుంటారు.. ఒక్కోసారి అది నిజమని అనిపిస్తుంటుందని హనుమాన్ గౌడ బెళగుర్కి తన మనసులోని మాటను తెలిపారు.

సిద్ధు, యతీంద్రకు సెగ

మైసూరు, న్యూస్‌టుడే : ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి డాక్టర్ యతీంద్రలను మైసూరు సమీప మండహళ్లి వద్ద రైతులు అడ్డుకున్నారు. తమ గ్రామాల్లో 165 ఎకరాల భూమిని కర్ణాటక పారిశ్రామికాభివృద్ధి మండలి బలవంతంగా లాక్కొంటోందని ఆరోపిస్తూ వారిని ఘెరావ్ చేశారు. తమ భూములను ఇవ్వబోమని, బలవంతంగా లాక్కొనకుండా సహకారం ఇవ్వాలని వినతిపత్రాన్ని అందించారు. వెనక కార్లలో వచ్చిన ఎమ్మెల్యేలు డి.రవిశంకర్, దర్శన్ ధ్రువనారాయణ్‌లు రైతులను సమాధానపరచి అక్కడి నుంచి పంపించారు.

నేడు కాంగ్రెస్ ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ పోలీసులు రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయటాన్ని ఖండిస్తూ మంగళవారం కాంగ్రెస్ ధర్నా చేపట్టనుంది. మల్లికార్జున ఖర్గే ర్యాలీ నిర్వహించిన హల్దాని ప్రదేశాన్ని శుద్ధీకరణ చేసిన భాజపా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలంటూ ఒత్తిడి తీసుకురానుంది. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బసవరాజ పాటిల్ ఇటగి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

లిఫ్టులో చిక్కుకున్న అసోం వ్యక్తి

మంగళూరు, న్యూస్‌టుడే : పాండేశ్వర ఠాణా పరిధి మిజార్ అపార్ట్‌మెంట్ లిఫ్టులో అసోంకు చెందిన కేశవ (33) చిక్కుకున్నారు. 2 గంటల పాటు అందులోనే ఉన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది కేశవను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

శరణ తత్వమే అత్యుత్తమం

మాటమార్చిన రాయరెడ్డి

బసవరాజ రాయరెడ్డి

కొప్పళ, న్యూస్‌టుడే : ప్రపంచంలో ముస్లిం ధర్మమే గొప్పదని ఆదివారం వ్యాఖ్యలు చేసిన ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ రాయరెడ్డి సోమవారానికి ప్లేటు ఫిరాయించారు. బసవేశ్వరుడు చెప్పిన 'కళబేడ, కొలబేడ, హుసియ నుడియలు బేడ' అనే వచనాన్ని ఉటంకిస్తూ శరణ తత్వమే ప్రపంచంలో అత్యుత్తమమైనదని విశ్లేషించారు. ఆయన సోమవారం యలబుర్గలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని ధర్మాలూ గొప్పవేనని చెప్పానని, దానిలో తప్పేముందని ప్రశ్నించారు. ఇస్లాంలోనూ అత్యుత్తమ విషయాలు ఉన్నాయని చెప్పానని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నవ ముస్లిం వధూవరులకు ఆశీస్సులు అందిస్తూ తాను మాట్లాడానని తెలిపారు. తాను అన్ని ధర్మాలనూ సమానంగా చూస్తానని, ఆయా ధర్మాల చరిత్రను తెలుసుకునేందుకు ఇష్టపడతానని చెప్పారు. క్రీస్తు సమాధిని ఇప్పటికే చూసి వచ్చానని గుర్తు చేశారు. సింధూ నదితోనే దేశానికి హిందూ అనే పదం వచ్చిందన్నారు. ప్రపంచంలో పలు ధర్మాలను నెలకొల్పిన వారు ఉన్నారని, హిందూ ధర్మానికి మాత్రం ప్రత్యేకంగా ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. యలబుర్గలోని ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి ఆయన సోమవారం ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

బోనులో పడిన పులి

మైసూరు, న్యూస్‌టుడే : గత కొద్ది రోజులుగా హెగ్గడదేవనకోటె తాలూకా హొసహొళలు గ్రామం చుట్టుపక్కల సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న పులి ఎట్టకేలకు బోనులో పడింది. హొసహొళలు గ్రామంలోని ఒక పొలంలో ఉంచిన బోనులో చిక్కుకున్న పులిని స్థానికులు సోమవారం ఉదయం గుర్తించి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ పులిని కబిని బ్యాక్ వాటర్ పరిధిలోని కాకనకోటె అటవీ విభాగంలో విడిచిపెడతామని ఆర్ఎఫ్ఓ హనుమంతరాజు తెలిపారు.

భార్య హింస భరించలేక

విడాకులు పొందిన భర్త

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : తన భార్య నిత్యం శారీరకంగా, మానసికంగా హింసిస్తోందంటూ వేసుకున్న అర్జీపై ఉన్నత న్యాయస్థానం విచారణను పూర్తి చేసింది. మైసూరుకు చెందిన దంపతులకు విడాకులు మంజూరు చేసింది. భార్యకు ఏకమొత్తంగా రూ.17 లక్షల మనోవర్తి ఇవ్వాలని జస్టిస్ డీకే సింగ్, జస్టిస్ హెచ్.శాంతిభూషణ్‌ల పీఠం ఆదేశించింది.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

31-08-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1630.60	1625.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,850	61,681
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,892	69,775
నీటి నిల్వ (టి.ఎం.సి)	96.343	77.542
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

వరండానే పురిటి గది..చీరలే మరుగు గోడలు

ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద చీరలు అడ్డుపెట్టి నిలబడ్డ మహిళలు

సింధనూరు, న్యూస్‌టుడే: 'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు పుడతాడు' అన్న సామెతలా..ఆ తల్లి కొడుకును కాకపోయినా సులువైన ప్రసవంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సమీపంలోని విరుపాపుర గ్రామానికి చెందిన రోజా అనే మహిళ నిండు చూలాలు. నెలలు నిండాయి. నలతగా ఉందని అనడంతో ఆమె అత్త వెంటనే ఆటోను పిలిచి సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపులోని ప్రభుత్వ తల్లీశిశువుల ఆసుపత్రికి తీసుకొచ్చింది. ఆటో దిగి ఆసుపత్రి లోనికి మెల్లగా నడిచి వెళ్తుండగా వరండాలోనే ఆ నిండు గర్భిణి నేలపై కూర్చుండిపోయింది. వైద్యులు వచ్చేంతలోపే నొప్పితో గిలగిలలాడింది. శిశువు బయటకొచ్చేస్తోందని సంజ్ఞ చేసింది. విషయం గమనించిన సమీపంలోని కొంతమంది మహిళలు చుట్టూ నిలబడి రెండు చీరలు అడ్డుపెట్టి మానవత్వం చాటారు. అప్పటికే పండంటి ఆడ శిశువు నేల స్పర్శ తాకింది. ఇంతలో ఇద్దరు వైద్యులు అక్కడికి చేరుకుని వైద్య సాయం అందించారు. రోజాకు ఇది రెండో కాన్పు. తొలి కాన్పులోనూ శస్త్ర చికిత్స లేకుండా మగబిడ్డకు జన్మనిచ్చిన ఈమె రెండో కాన్పు సైతం ఇబ్బంది లేకుండా సుఖంగా ప్రసవించడంపై ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రసూతి వార్డులో తల్లీశిశువులను పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమం అని తెలిపారు.

నేటి విద్యార్థులే భవిష్యత్తు నాయకులు

మాన్వి, న్యూస్‌టుడే: దేశభవిష్యత్తు రూపకర్తలు విద్యార్థులేనని వారికి ఇప్పటి నుంచే అన్ని వ్యవస్థల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత సమాజం మీదుందని సమాజ సేవకుడు యువనాయకుడు శివపూజి బసవరాజ్‌గౌడ తెలిపారు. శివపూజి ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చికల్‌పర్వి గ్రామంలోని రుద్రమునీశ్వర ఆంగ్లమాధ్యమ పాఠశాలలో నిర్వహించిన శివపూజి ఈరప్పగౌడ స్మరణను పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు, మొక్కలను వితరణ చేసి మాట్లాడారు. ప్రముఖులు గిరిధర్‌పూజారి, విరుపయ్యస్వామి, అమరేగౌడ, మల్లనగౌడ, ముక్లూరు రుద్రప్పగౌడ, శివకుమార్‌గౌడ, శేఖరప్పగౌడ, నాగరాజ్‌శెట్టి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో నిర్వాహకులు

(c) eenadu